# ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా

## The Bombay Andhra Mahasabha & Gymkhana


10-C, Lakhamshi Napoo Road, Dadar (E), Mumbai - 400 014, **Tel.:** 24144377 / 24144388, Fax : 24119832
**Email :** mahasabha@gmail.com | **Website :** www.bamsg.org


సంపుటి - 80 సంచిక - 09, 10 & 11 నవంబర్ 2014 - జనవరి 2015


తెలుగు భాషా, సాహితీ, సంస్కృతి, కళల, క్రీడల వార్తా విశేషాల..

# దర్పణం

Wishes you a

HAPPY NEW YEAR 2015









పాఠకులందరికీ

మహాశివరాత్రి శుభాకాంక్షలు




*With Best Compliments from*

*Prop.*
*Kasi Reddy*

# *Sri Sai Enterprises*

**CIVIL, ELECTRICAL ENGINEERS & CONTRACTORS**

(An ISO 9001: 2008 Certified Company)

Off.: Shop No.14, Shivshankar Bldg-II,
Sector-15, Plot No.17,
Sanpada, Navi Mumbai -400 705.
Email : srisai_kreddy@yahoo.co.in | Website : www.srisaikreddy.com

Advt.

**Tel.: (Off.) 6525 0965 | Telefax : 2781 0463 | Mobile : 93236 40922**

# ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా
## The Bombay Andhra Mahasaha & Gymkhana

10-C, Lakhamshi Napoo Road, Dadar (E), Mumbai - 400 014, Tel.: 24144377 / 24144388, Fax : 2411 9832
Email : mahasabha@gmail.com : Website : www.thebombayandhramahasabha.com


# దర్పణం



అధ్యక్షులు / సంపాదకత్వం
**సంకు సుధాకర్**

ప్రధాన కార్యదర్శి / సహకారం
**యాపురం వెంకటేశ్వర్**

పదాధికారులు
**అనుమల్ల రమేశ్**
ఉపాధ్యక్షులు, పరిపాలనా శాఖ
**గట్టు నర్సయ్య**
ఉపాధ్యక్షులు, సాంస్కృతిక శాఖ
**నడిమెట్ల యెల్లప్ప**
ఉపాధ్యక్షులు, సాహిత్య, జింఖాన
**రాపెల్లి పరమేశ్వర్**
కోశాధికారి

**యెలిగేటి రాజ్‌కుమార్**
సంయుక్త కార్యదర్శి, పరిపాలనా శాఖ
**శ్రీమతి రాధామోహన్**
సంయుక్త కార్యదర్శి, సాంస్కృతిక శాఖ
**వేముల మనోహర్**
సంయుక్త కార్యదర్శి, సాహిత్య, జింఖాన
**ఏ. వి. నాగేశ్వరరావు**
పి. ఆర్. ఓ.
**బడుగు విశ్వనాథ్**
సహాయ సంపాదకులు

సమన్వయ సంపాదకులు
**సంగెవేని రవీంద్ర**

సంపాదక సలహాదారులు
**ఏ. మల్లికార్జునరెడ్డి**

సహ సంపాదకులు
**డా॥ పాము మనోహర్**


## ఒక మాట

**నిప్పులు చిమ్ముకుంటూ**
**నింగికి నే నెగిరిపోతే,**
**నిబిడాశ్చర్యంతో వీరూ -**

**నెత్తురు క్రక్కుకుంటూ**
**నేలకు నే రాలిపోతే**
**నిర్దాక్షిణ్యంగా వీరే -**

– శ్రీ శ్రీ

సమాజం భిన్న సంస్కృతుల, విభిన్న మనస్తత్వాల సమూహం. సైద్ధాంతికంగా ఖండాల వారిగా, దేశాలవారిగా, రాష్ట్రాలవారిగా, జిల్లాల వారిగా, గ్రామాల వారిగా, చివరకు సంస్థల పరంగా కూడా ఎన్నో వైరుధ్యాల సమూహం ఈ మానవ సమాజం. అలాగనీ, సమూహాల మధ్య వైషమ్యాలు పెరగాల్సిన అవసరం లేదు.

ఏ సిద్ధాంతమైనా, ఏ భావజాలమైన మానవాళికి మేలు చేస్తుంటే మనమంతా స్వాగతించాలి. భిన్నాభిప్రాయాలున్నప్పుడే సామాజిక మంథనం జరుగుతుంది. లేకుంటే భావదారిద్ర్యంతో కుంచించుకు పోయే అవకాశాలు ఉన్నాయి. ముంబయిలో ఎన్నో తెలుగు సంస్థలు తమవంతుగా ఎన్నో కార్యక్రమాలు చేస్తూ తెలుగు భాషావికాసానికి, సాహితీ సంస్కృతులు పరిరక్షణకు సేవలందిస్తున్నాయి.

చేసే సేవల పట్ల పూర్తిగా చిత్తశుద్ధితో ఉంటే, లక్ష్యం ప్రగతి మార్గమే అయితే తమ దారిలో తాము ప్రస్థానించాలే తప్ప ఆగాల్సిన అవసరం లేదు. మహాసభలో మేం ఎంతో చిత్తశుద్ధితో అన్ని ప్రాంతాల, అన్ని వర్గాల, అన్ని వయసుల వారికి అనుకూలమైన కార్యక్రమాలు రూపొందిస్తున్నాం. మీ అందరి సహకారంతో మరెన్నో కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు వేస్తున్నాం.

మహాసభ ద్వారా మహారాష్ట్ర తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు మేం నిరంతరం పాటుపడుతున్నామనీ మరొక్కసారి తెలియచేస్తూ, కార్యక్రమాల్ని విజయవంతం చేయడంలో మీరు ఇస్తున్న సహకారానికి ధన్యవాదములు అర్పిస్తూ..

ప్రస్తుతానికి సెలవు..

**యాపురం వెంకటేశ్వర్**
ప్రధాన కార్యదర్శి

**సంకు సుధాకర్**
అధ్యక్షులు

# సంక్రాంతి శోభ

- పొన్నూరి భారతలక్ష్మి

వేకువలో కోవెలలో
సాగిపోతోంది
దనుర్మాస పూజల సందడి
వచ్చింది సంక్రాంతి లక్ష్మి ఇంటింటికి
తరిమికొడుతున్నాయి భోగి మంటలు చలిని
పోయాలి భోగి పళ్ళు చిర్నవ్వుల చిన్నారులకు
కట్టాలి గుమ్మాలకు
ముద్దబంతుల తోరణాలు
వెయ్యాలి ముత్యాల ముగ్గులు ముంగిట్లో
అమర్చాలి గొబ్బెమ్మలు ముగ్గుల్లో
మార్మోగిపోతున్నాయి వీధివీధులు
హరిదాసుల హరినామస్మరణంతో
వస్తున్నాయి డూడూ బసవన్నలు మన
ప్రాంగణంలోకి
క్రొత్త అల్లుళ్ళ రాకతో
క్రొత్త ధాన్యరాసితో
క్రొత్త బియ్యం పొంగళ్ళతో
పిండివంటల ఘుమఘుమలతో
ఇల్లంతా ఉత్సాహం ఉల్లాసం
గోమాతలకు పూజలతో
కోడి పందాల సరదాలతో
వచ్చింది మకరసంక్రాంతి
తెచ్చింది సుఖసంతోషాలు అందరికీ...!




### పేజీలు పెంచండి

దర్పణం అందంగా ముస్తాబై మమ్మల్ని చేరుకుంది. వ్యాసాలు, కవితలు, సంపాదకీయం అన్నీ బాగున్నాయి. కథలు ప్రచురించడం లేదు. దయచేసి ప్రతి సంచికలో ఒక కథనైనా ప్రచురించాలనీ కోరుకుంటున్నాను. ఒక సమగ్రమైన పత్రికలా తీసుకువస్తున్నందుకు ధన్యవాదములు. వీలైతే పేజీలు పెంచాలనీ మనవి.

- మాసం రామకృష్ణ

### ముఖచిత్రం బాగుంది.


గత సంచిక దర్పణం ముఖ చిత్రం అద్భుతంగా ఉంది. కాపు రాజయ్య పరిచయం కూడా ఆసక్తి గొలిపింది. అంత గొప్ప చిత్రకారుడు మన తెలుగు గడ్డపై జన్మించినందుకు గర్వంగా కూడాఉంది. మన దర్పణం ద్వారా మరుగున పడ్డ ఇలాంటి చిత్రకారుల్నే కాకుండా గొప్ప గొప్ప రచయితల్ని, గాయకుల్ని కూడా పరిచయం చేస్తే బాగుంటుందని నా సూచన.

- ఎలిగేటి తిరుపతి

### మహామనీషి

కొండా లక్ష్మణ్ బాపూజీ మన తెలుగువారి గాంధీగా చెప్పుకోవచ్చు. అంతటి మహనీయుడి పరిచయం ఇచ్చినందుకు దర్పణం సంపాదక వర్గానికి ధన్యవాదములు. బాపూజీ గురించి మాకు తెలియని ఎన్నో విషయాలను మేం దర్పణం ద్వారా తెలుసుకున్నాం. పిట్ల రాము తీసిన ఫోటోలు మమ్మల్ని విస్మయ పరిచాయి. దర్పణం ముంబయి పాఠకుల హృదయాల్లో చిరకాలం నిలిచిపోవాలని కోరుకుంటున్నాం.

- డా॥ చిలివేరి రవింద్ర




www.bmsg.org
mahasabha@gmail.com
Tel.: 022-4144377-88, TeleFax: 022-24119832

# వాట్సప్ మేనియా!

**గ**తంలో మనిషి ప్రశాంతంగా జీవించేవాడు. జీవితావసరాల కోసం మాత్రమే తాపత్రయపడేవాడు. తపించేవాడు. పోరాడేవాడు. కానీ కాలం మారింది.. ఇంకా మారుతోంది. మనిషికిప్పుడు రోటీ కప్డా ఔర్ మకాన్ మాత్రమే కాకుండా, కారు, సెల్లు, ఏసీ, కంప్యూటర్ లాంటివి కూడా జీవితంలో భాగం అయ్యాయి. ఇవి లేకుండా మనిషి బతకలేని పరిస్థితులు ఏర్పడ్డాయి.

ముఖ్యంగా సెల్లు ఫోన్ వల్ల జీవితం పెను మార్పులకు లోనయింది. ఫోన్ అనేది ఇద్దరు మనుషులు మాట్లాడుకునే సాధనం మాత్రమే కాకుండా, చేతిలో ప్రపంచాన్ని చూపించే అత్యవసర పరికరంగా మారింది. నడుస్తున్న కార్యాలయంగా మారింది. స్పెక్యులేషన్ అంటే షేర్ మార్కెట్ లాంటి బిజినెస్ లో ఉన్నవారు ఆఫీసులు మూసేసి కేవలం సెల్‌ఫోన్‌ల ఆధారంగానే వందల కోట్ల వ్యాపారం నిర్వహిస్తున్నారు. వైద్యసేవలు, విద్యావకాశాలు, ఉద్యోగాల వేట, పలు రకాల బుకింగ్‌లు, నెట్ బ్యాంకింగ్‌లు లాంటి ఎన్నో మహత్తర సేవల్ని సెల్‌ఫోన్ ద్వారా పొందవచ్చు. అందించ వచ్చు.

అయితే ఇవన్నీ నాణేనికి ఒకవైపు మాత్రమే.. మరో వైపు చాలా వికృతంగా మారుతోంది. మానవ జీవితాల్ని బొన్సాయ్‌గా మారుస్తోంది. మనిషి తనలో తాను కుంచించుకు పోయేలా చేస్తోంది. అరచేతిలో ఇమిడిపోయే సెల్ ఫోన్‌కు ఆరడుగుల మనిషి బానిసైపోతున్నాడు.

**సంగెవేని రవీంద్ర**

ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్రతి వ్యక్తి సెల్‌ఫోన్‌లో మునిగితేలుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. తింటున్నప్పుడు, భార్యపక్కన పడుకున్నప్పుడు, సమావేశాల్లో, సభల్లో.. చివరకు టాయ్‌లెట్స్‌లో కూడా సెల్‌ఫోన్ సముద్రంలో ఊపిరాడకుండా మునిగితేలుతున్నాడు. సెల్‌ఫోన్స్‌లో అందుబాటులోకి వచ్చిన సోషల్ మీడియా వల్ల, ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే ఎన్నో యాప్స్ అందుబాటులో ఉండడం వల్ల, సెల్‌ఫోన్స్ అన్నీ అండ్రాయిడ్‌గా మారడం వల్ల మనిషి తన స్వేచ్ఛను పోగొట్టుకొని, మానవ సంబంధాలను విస్మరించి కేవలం సెల్‌స్లేవ్‌గా మారిపోతున్నాడు.

ఈ మధ్యకాలంలో అండ్రాయిడ్ గాడ్జెట్ ఉన్న ప్రతివ్యక్తి వాట్సప్‌కు బానిస వుతున్నాడు. ఇదో చిత్రమైన యాప్..!! ముందుగా సెల్‌ఫోన్‌లోకి వాట్సప్ యాప్ ను డౌన్‌లోడ్ చేసుకొని, ఆ తర్వాత గ్రూప్‌లుగా ఏర్పడుతారు. ఒక్కో గ్రూప్‌లో వంద మందిని సభ్యులుగా చేర్చుకోవచ్చు. అంటే ఆ గ్రూప్‌లో ఒక్క మెసేజ్ పంపిస్తే అది వంద మందికి ఒకేసారి చేరుతుంది. అది కూడా పూర్తిగా ఉచితంగా..! అసలు ఈ వాట్సప్ విజయానికి ప్రధాన కారణం ఈ 'ఉచితమే..'

ఈ రకంగా ఒక వ్యక్తి పదుల సంఖ్యలో గ్రూప్ సభ్యుడిగా మారిపోతాడు. ఒక వ్యక్తి యాభై గ్రూపుల్లో ఉన్నాడనుకుంటే, ఆయన అయిదువేల మందితో కనెక్ట్ అయి ఉంటాడన్నమాట. ఈ అయిదు వేల మందిలో ఇరవై శాతం మంది యాక్టివ్‌గా ఉండి మెసెజ్‌లు పంపినా, సదరు వ్యక్తి వేయి మెసెజ్‌లు అందుకుంటాడు. అంటే వేయి మెసెజ్‌లు చదవాలి. వాటిని అర్థం చేసుకోవాలి. వాటిపై తనదైన శైలిలో స్పందించాలి. ఇంత పెద్ద పెనుభారం తలపై ఉన్నప్పుడు ఆ వ్యక్తి బయట ప్రపంచాన్ని ఎలా చూడగలుగుతాడు..?

చూడలేడు.. ఇప్పుడు జరుగుతోంది అదే.. నిజానికి వాట్సప్ ను సరిగ్గా ఉపయోగించుకుంటే లోకకళ్యాణం జరుగొచ్చు. ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా సెకండ్స్ కాలంలో మరోమూలకు సమాచారాన్ని, సంఘటనల్ని, ఫోటోలతో సహాచేరవేయొచ్చు. దూరాలను ఘోరాతిఘోరంగా దున్నేసిన వాట్సప్ మానవాళికి ఒక వరంగా వినియోగించుకోవచ్చు. కానీ జరుగుతోంది అందుకు భిన్నంగా ఉంది. గ్రూపు సభ్యులు ఎట్లాగూ తేరగా వచ్చింది గనక నానా రకాల చెత్తను పంచుతున్నారు. ఉదయం నుండి మళ్ళీ ఉదయం వరకు వాట్సప్‌లో రకరకాల ఫోటోలతో, నానా కంగాళీ మెసెజెస్‌తో విసుగు తెప్పిస్తున్నారు. ఉదయం లేవగానే గుడ్ మార్నింగ్స్‌తో మొదలుపెడతారు. మళ్ళీ రాత్రి గుడ్‌నైట్స్ చెబుతారు. వీరికి అర్థం కాని విషయం ఏంటంటే, ఎన్నో గ్రూపుల్లో ఉంటారు. ఎందరో సభ్యులు గుడ్‌మార్నింగ్ చెబితే అది రిసీవ్ చేసుకున్న వ్యక్తి అవన్నీ చదవలేక బ్యాడ్ మార్నింగ్‌కు బలవుతాడు తప్ప సంతోషం ఏం కలగదు.

కొందరు సభ్యులైతే తమ దిన చర్యను, అంటే ఉదయం ముంత తీసుకు వెళ్తున్న ఫోటోలను, కుటుంబ సభ్యులతో టిఫిన్ చేస్తున్న దృశ్యాన్ని, గుడ్డలే సుకుంటున్న ఫోటోలని, ఎదురుగా టేబుల్ పై డ్రింక్స్, గ్లాసెస్ పెట్టుకొని, గ్లాసులు చేతిలో పట్టుకొని అదేదో ఘనకార్యం చేసినట్లుగా ఫోటోలు దిగి గ్రూపులన్నింటికి పంపిస్తుంటారు. వీటివల్ల ఏం ప్రయోజనం..? ఎదుటివారి సమయాన్ని,

సహనాన్ని పరీక్షించడం తప్పు..!

ఇంకొందరు సభ్యులు గ్రూప్‌లో ఉంటూ కూడా, 'హాయ్ బావా..! ఎట్లున్నవ్.. రాత్రి నిద్రపట్టిందా..' అంటూ ప్రశ్నలేస్తారు. గ్రూప్‌లో ఈ వ్యక్తిగత సంభాషణ ఏంటో అర్థం కాదు. వెంటది వెంట కామెంట్స్ వస్తుంటాయి. సదరు సభ్యుడు ఎవర్ని బావా అని సంభోదించాడో కూడా మిగతా వారికి అర్థం కాదు. ఆ సభ్యుడికి ఎందరు బావలున్నారో కూడా తెలియదు.. ఎందుకిదంతా..?

ఇంకొందరేమో... ఒకేసారి పది ఇరవై ఫోటోలు పంపుతుంటారు. ఆ ఫోటోలు ఏవైన విజ్ఞానసర్వస్వాన్ని తీసుకొచ్చేవా అంటే అదీకాదు. చంద్రబాబు నాయుడు మీటింగ్‌లో మాట్లాడుతున్నప్పుడు, కేసీఆర్ గుడిసెవాసులతో ముచ్చటిస్తున్నప్పుడు, ఎప్పుడో మదర్ థెరెస్సా పిల్లాడ్ని ముద్దాడుతున్నప్పుడు, ఏదీ లేకుంటే ఏదో తాటి చెట్టుకింద ఎవడో కూర్చొని తెల్లకల్లు తాగుతున్నప్పుడు తీసిన ఫోటోలను పెడుతుంటారు. ఏం..? చంద్ర బాబు ఫోటో పేపర్స్‌లో, టీవీల్లో మిగతా సభ్యులు చూడకుండా ఉంటారా..? ఈ ఫోటోలు పెట్టిన సభ్యుడు మాత్రమే డిటెక్టివ్ నారద మిగతా సభ్యులంతా సన్నాసులా..? ఎందుకు ఇతరుల నెట్ చార్జీలను ఉత్తిపుణ్యానికే నాశనం చేస్తారో తెలియదు.

మరికొందరైతే, రాత్రుల్లు తాగి ఉంటారేమో... గ్రూప్‌లో వితండవాదానికి దిగుతారు. జీవితంలో ఎక్కడా సక్సెస్‌కాలేక, ఎవర్నీ ఏమీ అనలేక, పదిమందిలో కలిసి తిరగలేక, ఒంటరితనానికి గురై, ఒకరకమైన కాంప్లెక్స్‌తో బాధపడేవారు ముఖ్యంగా ఇలాంటి వితండవాదానికి దిగి ఆ గ్రూపులోని మిగతా సభ్యుల 'నీంద్ హరామ్' చేస్తుంటారు. మరికొందరు ఒకే రోజు పదిసార్లు పది కామెంట్స్, పది ఇరవై ఫోటోలు పెడుతుంటారు..

బయటి ప్రపంచంలో ఏ మాత్రం కనిపించని, ఎక్కడా గొంతు వినిపించని వ్యక్తులు కూడా వాట్సప్ గ్రూప్‌లో తమకున్న అపారపరిజ్ఞానాన్ని అలవోకగా పంచుతుంటారు. తెలుగు గ్రూప్‌లో ఉండి కూడా ఇంగ్లీస్ భాషలో దంచుతుంటారు. ఇంకొందరు గొప్పగొప్ప సూక్తుల్ని తామొక్కరే ప్రవక్త అయిన లెవల్లో పెడుతుంటారు. ఆ సూక్తులకు, వాటిని పోస్ట్ చేసిన వ్యక్తి ఆచరణకు అసలు పొత్తే ఉండదు. ఎందుకు ఇవన్నీ..?

కొందరు ఏదో ఒక కార్యక్రమం చేసి వాటికి చెందిన ఫోటోలను 'పాడిందే పాడరా పాచిపండ్ల దాసరీ..' అన్నట్లు వారాల తరబడి మళ్ళీ మళ్ళీ పోస్ట్ చేస్తుంటారు. మొదటిసారి 'వావ్' అనిపించిన ఆ ఫోటోలు, ఆ వ్యక్తులు తర్వాత్తర్వాత బోర్ కొడతారు. వీటి వల్ల ఏం ప్రయోజనం..? విసుగొచ్చి గ్రూప్‌ను వదిలిపోదామా అంటే దాని అడ్మిన్‌తో ఉన్న అనుబంధం, అప్పుడప్పుడు విలువైన సమాచారం అందించే పోస్టింగ్‌లు ఆ పని చేయనియ్యవు. ఒకరు ఏదో ఒక తిక్కలో 'కుర్రో..' అని పోస్టింగ్ పెడితే, వెంటనే మరొకరు దానికి సమాధానంగా 'మొర్రో' అని పోస్ట్ చేస్తాడు. ఈ కుర్రో మొర్రోల మధ్య మిగతా సభ్యులు నజ్జునజ్జు అవుతుంటారు.

ఈ పరంపర రోజంతా సాగుతుంటుంది. రాత్రి బాత్‌రూమ్‌కు వచ్చి, టైం చూసుకునేందుకు ఫోన్ తెరిస్తే అప్పుడు కూడా వాట్సప్‌లో కొనసాగుతున్న సంభాషణ కనిపిస్తుంది. అంత అవసరమా..? రాత్రి రెండు గంటలకు గ్రూప్‌లో చర్చాగోష్టి పెట్టేంత స్థాయి ఉందా..? దీనివల్ల సమాజానికి ఏదైన ప్రయోజనం ఉందా..? వ్యక్తిగతంగా మాట్లాడుకోవాలంటే వన్ టు వన్‌లో మాట్లాడుకోవచ్చు కదా..? గ్రూప్‌లో ఈ గోల ఎందుకు..? వివిధ గ్రూపుల్లో ఉన్న సభ్యులంతా ఆలోచించాలి. ఇంట్రెస్ట్ కలిగించే ఫోటోలు, ఏదో ఒక రంగంలో సాధించిన విజయాలకు చెందిన ఫోటోలు, ఆలోచింపచేసే సుభాషితాలు, కడుపుబ్బ నవ్వించే జోక్స్, సొంతంగా రాసిన మరీ పొడుగు కాని కవితలు లాంటివి పోస్ట్ చేస్తే మిగతా గ్రూప్ సభ్యులకు ఆహ్లాదంగా, హాయిగా ఉంటుంది. అప్పుడే జరిగిన ఏదో సంఘటన, వార్తను తాజాతాజాగా అందిస్తే అందించిన సభ్యుడు, వాట్సప్ రెండూ అభినందనీయులే అవుతారు.

ఆండ్రాయిడ్ (మనిషిలా ఆలోచించే యంత్రం) ఫోన్ మంచిదే కానీ మనుషుల్నే యంత్రాలుగా మార్చేస్తుందనే భయం కూడా ఉంది. వాట్సప్ లాంటి యాప్‌ల వల్ల మనిషి మరో మత్తులోకంలో మునిగిపోతున్నాడు.

చెత్తను ఊడ్చేస్తేనే ఉత్తమ దారి ఏర్పడుతుంది. వాట్సప్ గ్రూప్ అడ్మిన్‌లు ఆలోచించాలి.

❀❀❀



I already whatsapp'ed mom how you've been baby sitting me! Wait till she gets home!

# భారతీయ ఋషులు

**—: దుస్స రాములు :—**

బ్రహ్మ సృష్టికర్త. తన సృష్టి కార్యమునందు ఎవరైన సహాయం చేస్తే బాగుంటుందనీ ఆలోచించి, ఒక దివ్వపురుషుని సృష్టించాడు. ఆ దివ్వపురుషుడే అత్రి. తండ్రి చేసే సృజనలో సాయం చేసేందుకు తగిన అర్హత కోసం అత్రి తపస్సు చేసి జ్ఞానిగా మారాడు. ప్రాణి శరీరం పంచభూతములతో ఏర్పడిందని గ్రహించాడు. అస్థిరమైనదనీ, రక్తమాంసముల అస్తిపంజరమనీ, బుద్బుద ప్రాయంమనీ తెలుసుకున్నాడు. ఏనాటికైనా ఈ దేహం నశించిపోయేదనే నగ్నసత్యం గ్రహించాడు. అంతేగాదు, నిత్యమైన ఆత్మస్వరూపాన్ని కూడా అనుభూతి చెందాడు.



తపస్సు వల్ల శాశ్వత స్థితి కలుగుతుందనీ ఉగ్రతపస్సు మొదలు పెట్టాడు. కాలం కరుగుతోంది. అత్ర తపో సాధన నానాటికి పెరుగుతోంది. ఆ మహా ఋషి నేత్రముల నుండి దివ్యతేజస్సు వెలువడ సాగింది. ఆ కాంతి భూమా కాశాలు నిండిపో యింది. దశదిశలు ఆ తేజస్సును భరించలేక పోయాయి. ఆ తేజస్సును వెడల గ్రక్కాయి. ఆ తేజస్సంతా సముద్ర మందు పడిపోయింది. ఆ తేజస్సును బ్రహ్మ అందుకొని మింగాడు. ఆ దృశ్యాన్ని కనులారా చూసిన దేవతలు బ్రహ్మదేవున్ని స్తుతించారు.

అప్పుడు బ్రహ్మ ఆ దేవతలతో, ‘దేవతలారా..! ఈ తేజస్సుకు మనుజరూపం కల్పించెదను. అత్రికి వివాహం జరిగిన పిమ్మట అతని భార్య ఈ తేజేంశమును చంద్రునిగా కనుగొని, ఆ తేజము అనంతరం క్షీరసాగర మధన వేళ మరల శశంకాని కలియుననీ చెప్పి’ అంతర్ధానం అయ్యాడు.

అత్రి శ్రీహరి కరుణా విశేషంచే తపస్సు చేయసాగాడు.

కర్ధముడికి తొమ్మిది మంది కుమార్తెలు. అందులో అనసూయ ఒకరు. అనసూయను అత్రికి ఇచ్చి పెళ్ళిచేయాలని సంకల్పించాడు కర్ధముడు. తపోసాధనలో ఉన్న అత్రిని పిలిపించాడు. అతని అంగీకారంతో అనసూ యను అత్రికి ఇచ్చి వివాహం జరిపించాడు. అత్రి గృహస్థాశ్రమమును స్వీకరించాడు. అనసూయ భర్తతో కాపురం చేయ సాగింది.

ఆమె తన పాతివ్రత్య మహిమచే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను పసిపాపలను చేసి వారికి నగ్నంగా ఆతిథ్య మిచ్చింది. మళ్ళీ వారిని స్వస్వరూపులుగా మార్చింది. అనసూయ పాతివ్ర త్యానికి త్రిమూర్తులు సంతసించి తమ తమ అంశలచే ముగ్గురు పుత్రులు జన్మించగలరని వరమిచ్చి అంతర్ధానం అయ్యారు.

ఆత్రి అనసూయలు ఇహలోక సకల సుఖాలను అనుభవించారు. కానీ ఈ సుఖాలు పరలోక సుఖాలకు అర్హత కలిగించవనే జ్ఞానాన్ని అత్రి తెలుసుకున్నాడు.

ఆ తర్వాత అత్రి అనసూయతో కలిసి ఋక్షపర్వతం పై పంచ సంవత్సరాలు తపస్సు నాచరించాడు. త్రిమూర్తుల దర్శనం లభించగానే, సంతానం కలగాలనీ ప్రార్థించాడు. త్వరలోనే సంతానం కలుగుతుందని చెప్పి వారు అదృశ్యమయ్యారు. మరికొంత కాలానికి త్రిమూర్తుల అంశతో అత్రి నేత్రం నుండి చంద్రుడు జన్మించగా, అనసూయ దత్తాత్రేయ, దుర్వాసులను కన్నది. ఈ ముగ్గురు పిల్లలు పెరిగి పెద్దకాసాగారు. వారిని పెంచేందుకు పృథి చక్రవర్తిని అడిగి ధనం తీసుకురమ్మని అనసూయ అత్రిని పంపించింది. అత్రి బయలుదేరాడు.

అదే సమయంలో పృథి చక్రవర్తి అశ్వమేధ యాగము చేయుచున్నాడు. గౌతముడు కూడా పాల్గొన్న ఆ యజ్ఞం నిర్విఘ్నంగా పరిసమాప్తి అయింది. చక్రవర్తి బ్రహ్మణులకు విశేషంగా దక్షిణలిచ్చి పంపిస్తున్న వేళ అత్రి చేరుకొని చక్రవర్తిని కీర్తించాడు. అది విన్న గౌతముడు 'ఒక సామాన్యున్ని ఇంతగా కీర్తించాల్సిన అవసరం లేద'న్నాడు. అత్రి గౌతముల మధ్య సంవాదం పెరిగింది. చివరకు పృథు చక్రవర్తిని కీర్తించడం తప్పులేదని నిర్ణయించారు. గౌతముడు మౌనము వహించాడు.

పృథు చక్రవర్తి అత్రిని సత్కరించి ధన కనక వస్తు వాహనములను ఇచ్చి పంపించాడు. అత్రి మహర్షి ఆ సంపదను కుమారులకిచ్చి భార్యతో తపస్సునకై అడవులకు వెళ్ళిపోయాడు.

ఒకానొక సమయంలో జంబాది రాక్షసులతో దేవతలు యుద్ధం చేయవలసి వచ్చినది. వారి దాటికి సూర్యచంద్రులు అలసిపోయారు. దాంతో లోకాలన్నీ అంధకారం అయిపోయాయి. రాక్షసులు మరింత విజృంభించారు. దేవతలు బయపడి అత్రి మహర్షిని శరణు వేడగా, అతడు వారికి అభయం ఇచ్చి, రాక్షసులను తన కోపోద్ధృక్తులతో నశింపచేశాడు. మహర్షి కరుణా విశేషంచే దేవతలు బ్రతికి బయటపడ్డారు. అత్రి మహర్షి ఇలాంటి లోకోపకారాలు ఎన్నో నిర్వర్తించారు.

అత్రి మహర్షి సీతారామ లక్ష్మణులకు తన ఆశ్రమమున ఆతిథ్యమిచ్చి వారిని ఆశీర్వదించి పంపాడు. మహర్షుల విన్నపం పై అత్రి మహర్షి అత్రి సంహితను ఉపదేశించారు. అత్రి మహర్షి పేర అత్రియ ధర్మశాస్త్రము కలదు. ఈ ధర్మశాస్త్రములు తొమ్మిది అధ్యాయములు. ఎన్నో విషయాలు పొందుపరచబడిన శాస్త్రమిది. అత్రి మహర్షి తన అభిప్రాయమును ఋషులకు ఈ విధంగా తెలిపాడు.

'ఋషులారా...! దేవతలందరిలోనూ శ్రీమన్నారాయణుడే ఉత్తమోత్తముడు. నిర్గుణుడు, నిరంజనుడు, నిర్వికారుడు, నిర్వికల్పుడు, పరంజ్యోతి. అతనిని అర్చించుటయే పరమ ధర్మము, మోక్షదాయకము. పరమేశ్వరోపాసనమే తరుణోపాయం అని తెలుపుతూ, యోగము, యోగాంగములు కూడా వివరించాడు. అంతేగాక, లఘ్వత్రి స్మృతి, వృద్ధాత్రేయ స్మృతి అని అత్రి మహర్షిపేర రెండు స్మృతులు మనకు లభిస్తున్నాయి. ఇది అత్రి మహర్షి గురించిన సంక్షిప్త చరిత్ర.

❋❋❋



# యాత్రాస్మృతి

- పొన్నూరి భారతలక్ష్మి



ఈ మధ్య మేము కొంతమంది బంధుమిత్రులం కలిసి థాయ్‌లాండ్, మలేషియా, సింగపూర్ యాత్రలకు వెళ్లాం. అందరం హైదరాబాద్ రాజీవ్‌గాంధీ విమానాశ్రయం నుండి బయలుదేరాం. ముందుగా మేం బ్యాంకాక్ విమానాశ్రయం సువర్ణభూమి చేరాం. ఎయిర్‌పోర్టు చాలా బాగుంది. బ్యాంకాక్‌లో ఎలిఫెంట్ షో, క్రోకడైల్ షో చూశాకా అల్‌కాజర్‌షోకి వెళ్ళాం. అది డ్యాన్స్ షో. అక్కడ ఎన్నో సంప్రదాయ, సాంస్కృతిక నృత్యాలతో పాటు మన హిందీ పాట 'నాచ్‌రే ... నాచ్‌రే..' అనే పాటకు కూడా డ్యాన్స్ చేశారు. షో చాలా బాగుంది.

తరువాతి రోజు కోరల్ ఐలాండ్, పట్టయా బీచ్‌కు వెళ్ళాం. అక్కడ స్కూబా డైవింగ్ అంటే సముద్రంలోతులకు వెళ్ళి సముద్ర జీవజాలాన్ని, వింతల్ని చూడవచ్చు. దానికి తగిన దుస్తులు ఇస్తారు. ఇంకా 'పారాసైలింగ్' అంటే పారాచ్యూట్‌లో పైకి ఎగరడం... ఇవన్నీ ఉంటాయి. వీటివల్ల అక్కడ ఎంతో సందడిగా ఉంటుంది. తరువాత మేము పట్టాయా టవర్ పై నుండి రోప్‌వేలో కేబుల్ కార్‌లో వెళ్ళాం. అక్కడ నుండి వూరంతా కనిపిస్తుంది. థాయ్‌లాండ్ బౌద్ధులు 90 శాతం ఉంటే 10 శాతం మిగతా వారుంటారు. అక్కడ రాజులదే పాలన. రాజు, రాణి గార్ల ఫోటోలు వూరంతా రోడ్లమీద కనుపిస్తాయి. ఇక్కడ మేం గోల్డెన్ బుద్ధ టెంపుల్‌కి వెళ్ళాం. 5501 కిలోల బంగారంతో చేయబడ్డ బుద్ధుడి విగ్రహం అది. 3.50 మీటర్ల ఎత్తు, 1.50 మీటర్ల వెడల్పు ఉన్న విగ్రహం అది. చాలా బాగుంది. ఇంకా ఇక్కడ మేము



ఫ్లోటింగ్ మార్కె ట్‌కు వెళ్ళాం. అంటే మనం బోట్‌లో కూర్చుని షాపింగ్ చేసుకోవచ్చు. ఇక్కడ మనం ఎక్కడా చూడనన్నీ రకాల ఫ్రూట్స్ వుంటాయి. రుచిగా కూడా ఉంటాయి.

బ్యాంకాక్ కరెన్సీ పేరు 'బాహత్'. ఒక్క బాహత్ విలువ మన రెండు రూపాయలంత.

తరువాత మేం టైగర్ టెంపుల్ చూశాం. అక్కడ 12 పులులు వుంటాయి. అందరం పులుల తాకి, పులుల ప్రక్కన కూర్చొని ఫోటోలు దిగాం. ఇంకా సఫారీ వరల్డ్ లో వేల్స్ షో, డాల్ఫిన్ షోలలో వాటి విన్యాసాలు చూడాలే కానీ మాటల్లో చెప్పలేం.

మరునాడు మేం స్టార్ క్రుయిజ్ లిబ్రా లో ప్రయాణించాం. ఈ క్రుయిజ్‌లో అన్నీ వుంటాయి. ఒక వూరు లాగా వున్నది. తరువాతి రోజు మేం మలేషియాలోని కౌలాలంపూర్ లో పేరెన్నిక గన్న 452 మీటర్ల ఎత్తున్న, 88 అంతస్తుల ట్విన్ టవర్స్‌ను చూశాం. అద్భుతంగా ఉందది. ఇంకా 421 మీటర్ల ఎత్తున్న కేఎల్ టవర్స్ కట్టడం పై అంతస్తు గుండ్రంగా తిరుగుతూ వుంటుంది. దీన్ని ఫ్లోటింగ్ హోటల్ అంటారు. అక్కడ అంత ఎత్తులో మేం డిన్నర్ చేశాం. ఎన్ని రకాల వంటలో చెప్పలేం.

మలేషియా కరెన్సీనీ రింగ్గెట్స్ అంటారు. ఒక రింగ్గెట్ మన 18 రూపాయలతో సమానం. మలేషియాలో ముస్లింల జానాభా ఎక్కువని చెబుతారు. మురుగన్ విగ్రహాల్లో అత్యంత ఎత్తైన రెండవ విగ్రహాన్ని ఇక్కడ మేం చూశాం. ఆరు బయట ఉన్న ఈ విగ్రహం ఎత్తు 132 అడుగులు. బంగారు పూతతో మెరిసిపోతున్నది.

కౌలాలంపూర్ నుండి తరువాత మేం సింగాపూర్ చాంగీ ఎయిర్‌పోర్టులో దిగాం. ఎయిర్‌పోర్టు చాలా బాగుంది. సింగాపూర్ కరెన్సీనీ సింగపూర్ డాలర్ అంటారు. ఒక డాలర్ విలువ 48 రూపాయలు. ముందుగా మేం యూని వర్సిల్ స్టూడియో వెళ్లాం. ఇక్కడ ఎన్నో రైగ్స్ ఉన్నాయి. జురాసిక్ పార్కు, ష్రెక్ 4డి అడ్వెం చర్, ట్రాన్స్‌ఫార్మర్స్ ది రైడ్ అంటే మనం కారులాంటి దాంట్లో కూర్చుంటే మన ముందు పెద్దపెద్ద మరమనుషులు మీదిమీదికొస్తూ కారుని ముందుకు పోకుండా ఆపుతుంటారు. భలే భయంగా, థ్రిల్లింగ్‌గా వుంటుంది. ఆ ఎఫెక్ట్స్ చూడాల్సిందే కానీ చెప్పలేం. ఇంకా ఎన్నో వింతలూ, విశేషాలు చూశాం. ఆఖరుగా సముద్రపు వొడ్డున లేజర్ షో చూశాం. చాలా చాలా బాగుంది. తరువాత రోజు సెంటోసా మెర్లిన్‌కు వెళ్ళాం. సింగాపూర్ అంటే గుర్తుకు తెచ్చే పెద్ద సింహం నోరు బొమ్మ. సింహం నోట్లోంచి నీళ్ళు వస్తుంటాయి. ఇంకా మేం సింగాపూర్ ఫ్లైర్ ఎక్కాం. జైంట్ వీల్‌లాగా వుంటుంది. ఆ వీల్ ఒక రౌండ్ తిరగడానికి 45 నిమిషాలు పడుతుంది. అసలు తిరిగినట్లే వుండదు. 165 మీటర్ల ఎత్తున్న వీల్ నుండి చూస్తూంటే సింగపూర్ వూరంతా అద్భుతంగా కనిపిస్తుంది. ఇంకా ఎన్నో వింతలు విశేషాలు చూశాం. పెద్ద ఫిష్ ఎక్వేరియం చూశాం.



సింగాపూర్ అంతా ఎవరో చేయి తిరిగిన చిత్రకారుడు గీసిన అద్భుత చిత్రపటంలా వుంటుంది. తీర్చిదిద్దినట్లున్న రోడ్లు, ఆకాశాన్నంటే కట్టడాలు, ఎక్కడ చూసినా ఏది చూసినా ఎంతో అందంగా, శుభ్రంగా వుంటుంది. మన దేశం కూడా ఎప్పటికైనా ఇలా వుండాలని కోరుకుంటూ ఇక్కడితో మా యాత్ర పూర్తి చేసుకొని సంతోషంగా అందరం తిరుగుప్రయాణం అయ్యాం.

❋❋❋





# ఉత్తమ విద్యార్థులకు సన్మానం

ఆంధ్రమహాసభలో పదవ, పన్నెండవ తరగతుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమానికి ముంబయి మహానగర డిప్యూటి మేయర్ అల్కా కేల్కర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ముందుగా ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ సభకు స్వాగతం పలికారు. తదనంతరం సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి రాధామోహన్ మరియు రాజ్యలక్ష్మి గోపాలమూర్తి శిష్యబృందం వారు నాట్యప్రదర్శన చేశారు.

ఆపై, అధ్యక్షులు సంకు సుధాకర్ చేతుల మీదుగా అతిథుల్ని ఘనంగా సత్కరించారు. ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ రాబోయే కార్యక్రమాల గురించి సభకు వివరించారు. ప్రధాన కార్యక్రమం అయిన సన్మాన సమారంభంలో ముఖ్యఅతిథి డిప్యూటి మేయర్ శ్రీమతి అల్కా కేల్కర్ చేతుల మీదుగా పన్నెండవ తరగతిలో మొదటి బహుమతి చావెలి వెంకటసాయి, ద్వితీయ బహుమతి మద్దిరెడ్డి దివ్య, మూడవ బహుమతి కొక్కుల గౌతమికి అందించారు. పదవ తరగతిలో మొదటి బహుమతి మద్దిరెడ్డి అంజలి, రెండవ బహుమతి కె. స్థితప్రజ్ఞ, మూడవ బహుమతి కుంట శృతి గెలుచుకున్నారు.

ఇటీవలే మేయర్ అవార్డు పొందిన ఎనుగందుల జయశ్రీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఎమ్.నారాయణ, అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక ప్రధాన కార్యదర్శిగా నియమించబడిన సంగెవేని రవీంద్రను కూడా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి కార్యదర్శి మంతెన రమేశ్, సభ్యులు మార్గం రాజ్‌పాల్, పోతు రాజారాం, పరిపాలనా శాఖ ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్, సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షులు గట్టు నర్సయ్య, సాహిత్య శాఖ ఉపాధ్యక్షులు నడిమెట్ల యెల్లప్ప, సంయుక్త కార్యదర్శులు యెలిగేటి రాజ్‌కుమార్, వేముల మనోహర్, రాధామోహన్, పీఆర్వో ఎ.నాగేశ్వరరావు, సభ్యులు బడుగు విశ్వనాథ్, తాళ్ళ నరేశ్, సిరిమల్ల శ్రీనివాస్, రాంపెల్లి జ్ఞానేశ్వర్, కస్తూరి హరిప్రసాద్, కాశిరెడ్డి, బైరం రామ్‌మోహన్, మహిళాశాఖ ఉపాధ్యక్షురాలు తురగా జయశ్యామల తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని పరిపాలనాశాఖ ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్, విద్యాశాఖ బాధ్యులు బడుగు విశ్వనాథ్ రూపొందించారు. యెలిగేటి రాజ్‌కుమార్ వందన సమర్పణ గావించారు.



## జరిగిన కార్యక్రమాలు

తేది: 17.11.2014



**మహిళాశాఖ అధ్వర్యంలో కార్తీక దీపాలంకరణ**

ఆంధ్రమహాసభ మహిళాశాఖ అధ్వర్యంలో దీపాలంకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి కన్నుల పండువగా విచ్చేశారు.

ముందుగా 'తులసీ పూజను' నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదుపరి శివాష్టకం పఠించారు. దీపాలు అంటేనే కాంతి. ఈ సంవత్సరమంతా సభ్యులంతా కాంతి వంతమైన జీవితం గడపాలనీ ఆకాంక్షిస్తు, దానికి ప్రతీకగా అందంగా కార్తీక దీపాలను వెలిగించి సభాప్రాంగణాన్ని అలంకరించారు.

ఎంతో వైభవంగా, ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమంలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి మహిళా శాఖ కార్యదర్శి యత్తం లతతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.


Venkattesh Iyer's
M.Sc., M.B.A.
080974 95234
080974 95235

**Suprabhath**
Events and Cuisines

**We provide end to end services for South Indian Weddings, Social Functions & Parties.**

- Veg. Catering
- Flower Arrangements
- Photos, Video & Live Streaming
- Event Setup & Assistance
- Marriage Registration
- Travel Assistance & Accommmodations

Vesaga Info Services Pvt. Ltd. +91 91465 48913
+91 91465 48918

**Shuubhvivah.com**
*Truly Matrimonial Service*
Tamil - Telugu - Kannada - Malayalam

- Horoscope Centre
- Marriage Meet
- Book Matrimony

**9-10, Sundaram Apt, Shree Jai, Om CHS, Near Madhavi School, Rajaji Road, Dombivali (E), Thane : 421201,**
Email : info@suprabhath@gmail.com | info@shuubhvivah.com
www. shuubhvivah.com



## శకుంతల సంగీత నృత్యరూపకం

**ఆం**ధ్రమహాసభ ప్రాంగణంలో తేది: 22.11.2014, శనివారం నాడు హైదరాబాద్‌కు చెందిన కళాభారతి (నిజామాబాద్) వారి అధ్వర్యంలో శకుంతల సంగీత నృత్యనాటకం ప్రదర్శించారు. ఈ నృత్యనాటకానికి ఎ.చంద్రప్రకాశ్ దర్శకత్వం వహించారు.

ఈ నృత్యనాటకంలో శకుంతలగా చాందనీ అని పిలవ బడే ఎల్.చంద్రశేకర్‌రెడ్డి. దుష్యంతుడిగా నాట్య విజ్ఞాన గురు శ్రీ ఎమ్. మోహన్ గారు చేసిన నృత్యాలు సభికుల్ని ఎంతో ఆకట్టుకున్నాయి. మిగతా నృత్యకళాకారులు కూడా అద్భుతమైన నృత్యాల్ని ప్రదర్శించి రక్తి కట్టించారు. ప్రకృతిని నేలకు దింపినట్లుగా సెట్టింగ్‌లు కూడ అబ్బురపరిచాయి.

తొలుత ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆదాయపు పన్ను శాఖ సంయుక్త కమీషనర్ జీవన్ లాల్ లవాడియా దీప ప్రజ్వలన కావించి కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షులు గట్టు నర్సయ్య, సంయుక్త కార్యదర్శి రాధామోహన్ నిర్వహించారు.

తరువాత జరిగిన సభా కార్యక్రమంలో శాసన సభ సభ్యులు తమిళ సెల్వం, ముఖ్యఅతిథి జీవన్‌లాల్ లవాడియా చేతుల మీదుగా కళాకారులను ఘనంగా సన్మానించారు.

అధ్యక్షులు సంకు సుధాకర్ సభనుద్దేశించి మాట్లాడుతూ, ముంబయి లాంటి మహానగరంలో ఒక దక్షిణ భారతీయుడు, తమిళనాడుకు చెందిన తమిళ సెల్వం శాసన సభ సభ్యుడిగా ఎన్నిక కావడం ఎంతో ఆనందదాయకం, దక్షిణ భారతీయులందరికీ గర్వకారణం అని కొనియాడారు.

శాసన సభ సభ్యులు తమిళ సెల్వం మాట్లాడుతూ,





ఒకప్పుడు మదరాసు పట్టణం రాజధానిగా ఆంధ్రప్రాంతం కలిసే ఉండేవాళ్ళమనీ, అందువల్ల తెలుగువారు, తమిళులు సోదరసమానులనీ, ముంబయి నగరంలో కూడా ఎలాంటి బేధా భావాలు లేకుండా మనమంతా కలిసే ఉండాలనీ, ఒక దక్షిణ భారత శాసనసభ్యుడిగా తెలుగువారికి చేతనైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటాననీ అన్నారు. తర్వాత ముఖ్యఅతిథి జీవన్ లాల్ లవాడియా మాట్లాడుతూ, ఆంధ్రమహాసభలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో సంతోషం కలిగిస్తున్నాయనీ, ఒక ప్రభుత్వ అధికారిగా ఎప్పుడు ఎలాంటి సహకారం కావాలన్న అందిం చేందుకు సిద్ధంగా ఉంటాననీ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మెన్ సంగం ఏక్‌నాథ్, కార్యదర్శి మంతెన రమేశ్, అధ్యక్షులు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్‌చ ధర్మకర్తల మండలి సభ్యులు మార్గం రాజ్‌పాల్, పోతు రాజారాం, పరిపాలనా శాఖ ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్, సాహిత్య శాఖ ఉపాధ్యక్షులు నడిమెట్ల యెల్లప్ప, సంయుక్త కార్యదర్శి యెలిగేటి రాజ్‌కుమార్, వేముల మనోహర్, కార్యవర్గ సభ్యులు గుజ్జేటి గంగాధర్, బడుగు విశ్వనాథ్, తాళ్ళ నరేశ్, సిరిమల్లె శ్రీనివాస్, రాంపెల్లి జ్ఞానేశ్వర్, తాటికొండ మోతీరాం, కస్తూరి హరిప్రసాద్, కాశిరెడ్డి, బైరం రాంమోహన్, మహిళాశాఖ సభ్యులు బెహరా లలిత, పొన్నూరి

## జరిగిన కార్యక్రమాలు

తేది: 30.11.2014



**మహిళాశాఖ అధ్వర్యంలో 'వివాహ వేదిక'**

మహిళాశాఖ అధ్వర్యంలో తేది: 30.11.2014 నాడు వివాహ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించిన ఈ కార్యక్రమంలో అమ్మాయిలు అబ్బాయిల తో పాటు పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళాశాఖ కార్యవర్గ సభ్యురాలు రత్న కుమారి, శ్యామల రాంమోహన్ వివాహవేదికకు వివరాలు సమర్పించిన దాదాపు 200 మంది యువతీ యువకుల బయోడేటాలను చదివి వినిపించారు.

కార్యక్రమానికి విచ్చేసిన తల్లిదండ్రులు వివరాలన్నింటిని నమోదు చేసుకున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ, మహిళాశాఖ కార్యదర్శి యత్తం లత తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమానికి మహాసభ అధ్యక్షులు సంకు సుధాకర్, మహిళాషాఖ సభ్యులు, శామల రామ్‌మోహన్, కె రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## జరిగిన కార్యక్రమాలు

తేది: 10.12.2014



**ఘంటశాల జయంతి తెలుగు సంగీత విభావరి**




ఆంధ్రమహాసభ సంస్థాపన లక్ష్యమైన తెలుగు సాహితీ సంస్కృతుల పరిరక్షణలో భాగంగా అమరగాయకుడు ఘంటశాల వెంకటేశ్వరరావు 92వ జయంతి సందర్భంగా తెలుగు సంగీత విభావరిని నిర్వహించారు.

బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వందలాది మంది తెలుగు ప్రజలు దూరదూర ప్రాంతాల నుండి హాజరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కళాకారుడు సలీం నిర్వహణలో ఘంటశాల ప్రతిభా విశేషాలను వివరిస్తూ జరిగిన ఈ సంగీత విభావరిలో గాయకులు చంద్రతేజ, పద్మావతి, సుధారాణి తదితరులు ఘంటశాల అలనాడు ఆలపించిన, అతడి దర్శకత్వంలో వచ్చిన అరుదైన పాటలు, పద్యాలను పాడి ఆహుతుల కరతాళ ధ్వనులను అందుకున్నారు.

గాయకుడు చంద్రతేజ పాడిన 'నీలకంధరా దేవా..దీన బాంధవా రారా..' అనే పాటతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించింది. ఈ కార్యక్రమంలో 'హిమగిరి సొగసులు మురిపించును సొగసులూ...' 'తెలిసిందిలే... తెలి సిందిలే.. నెలరాజా నీ రూపు తెలిసిందిలే..' 'హాయిహాయిగా అమని సాగే..' అలాగే, 'అందమే ఆనందం.. ఆనందమే జీవిత మకరందం..' 'అమ్మా అని పిలిచినా

ఆలకించవేమమ్మా..' వంటి పాడి శ్రోతలకు వీనుల విందు చేశారు.

కాగా, కరీంనగర్‌కు చెందిన టైగర్ వడ్లకొండ అనిల్, గాయని రాయల్ రజిత చక్కని జానపద గీతాలతో శ్రోతల్ని ఉత్సాహపరిచారు. కీ బోర్డు పై రాగిపవన్, తబలా పై రమణమూర్తి, అక్టోప్యాడ్స్‌పై వేణుగోపాల్ డప్పుతో ప్రశాంత్ తదితరులు వాద్యసహకారాన్ని అందించారు.

తొలుత సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షులు గట్టు నర్సయ్య, సంయుక్త కార్యదర్శి రాధామోహన్ సభికులకు స్వాగతం పలికారు. అంతకు ముందు ముఖ్య అతిథి వడ్డేపల్లి కృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆరంభించారు.

ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మెన్ సంగం ఏక్‌నాథ్, కార్యదర్శి మంతెన రమేశ్, సభ్యులు పోతు రాజారాం, అధ్యక్షులు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం



వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్, గట్టు నర్సయ్య, నడిమెట్ల యెల్లప్ప, సంయుక్త కార్యదర్శులు యెలిగేటి రాజ్‌కుమార్, రాధామోహన్, వేముల మనోహర్, కోశాధికారి రాపెల్లి పరమేశ్వర్, సభ్యులు గుజ్జేటి గంగాధర్, బదుగు విశ్వనాథ్, తాళ్ళ నరేశ్, రాంపెల్లి జ్ఞానేశ్వర్, తాటికొండ మోతీరాం, కస్తూరి హరిప్రసాద్, మహిళాశాఖ కార్యదర్శి యత్తం లత, ఉపాధ్యక్షురాలు తురగా జయశ్యామల, సభ్యులు శ్యామల రాంమోహన్, బెహరా లలిత, పొన్నూరి భారతలక్ష్మి తదదితరులు పాల్గొన్నారు.

❀❀❀









# కాళోజీ అంటే బతుకమ్మే..!

- సంగెవేని రవీంద్ర

అతలాకుతలమైన సమాజం
గాయాల సంగ్రామంగా మారినప్పుడు
ఘోరనేరాల శరాఘాతాలకు
సామాన్యుడు సతమతమైనప్పుడు
కాళోజీ అక్షరం అగ్నిగోళమై భగ్గుమన్నది...
వివక్ష కోరలు విచక్షణారహితంగా
ప్రాంతాల్ని, ప్రజల్ని అవమానిస్తుంటే
భాషను యాసను అపహాస్యపు అంగట్లో
బజారు బొమ్మగా ఆడిస్తుంటే
కాళోజీ అక్షరం
స్వాభిమాన కవచమై సవాల్ చేసింది...
రక్తం చెమట కన్నీళ్ళన్నీ కలుషితమై పారినపుడు
అక్రమాల చక్రాలు హద్దులన్నీ దాటినపుడు
తన గొడవతో గొడుగు పట్టి
ధ్వజస్తంభమై నిలిచాడు..
గాయాలను గేయాల కరవాలం చేసి
శోకశ్లోకాల కల్లోలిత కవిత్వంతో
సామాన్యుడి కళ్ళను మెరిపించాడు...
తన మార్గం .. తన పంథా .. తన గొడవ
అనితర సాధ్యం...
తన రాత ... తన కూత ... తన చేత
అంతా స్వాంతన సంగీతం
అన్యాయాన్ని ఎదిరించిన వాడిని ఆరాధించి
పిరికితనం కంటే హింసే మేలని ఉద్ఘోషించి
మనసుతో పలికిన కాళోజీ
మనుషుల్నే ప్రేమించిందు...
గుళ్ళలోని రాతిబొమ్మలకంటే
గుండె తడున్న మనిషినే పూజించిందు
కష్టాల్ నష్టాల్ నిష్ఠూరాలకు వెరవక
నిర్భీతి నిజాయితీ సచ్చీలతలకు
నిలువెత్తై నిలిచిందు..
కాళోజీ అంటే కాలుతున్న కొవ్వొత్తి
కాళోజీ అంటే సామాన్యుడి తండ్లాట
కాళోజీ అంటే మత్తడి దునికే వరద
కాళోజీ అంటే...
తెలంగాణ బతుకూ .. బతుకమ్మా...!!



❀❀❀



## మహిళాశాఖ అధ్వర్యంలో లక్ష్మీపూజ

ఆంధ్రమహాసభ ప్రాంగణంలో మహిళాశాఖ అధ్వర్యంలో మార్గశిర మాస గురువారం నాడు లక్ష్మీపూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. భక్తిప్రవృత్తులతో మహిళాశాఖకు చెందిన ప్రతినిధులు వేదపండితులు శ్లోకపఠనాల మధ్య ఘనంగా పూజను నిర్వర్తించారు. ఈ కార్యక్రమానికి మహిళాశాఖ సభ్యురాలు సుజాతామూర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించి అన్నీ తానై పూజను నిర్వహించారు.

విచ్చేసిన భక్తులంతా లక్ష్మీపూజలో పాల్గొని తరించారు. తదుపరి ప్రసాద వితరణ చేశారు. దాంతో పాటే మహిళలందరికీ పసుపు కుంకుమలు కానుకగా అందించారు.

ఈ కార్యక్రమంలో మహిళాశాఖ ఉపాధ్యక్షురాలు తురగా జయశ్యామల, కార్యదర్శి యత్తం లతతో పాటు కార్యవర్గ సభ్యులెందరో పాల్గొన్నారు.

❀❀❀

### : గమనిక :

**జీవిత / పోషక సభ్యుత్వ దరఖాస్తు**

తేది 1 నుండి 28 ఫిబ్రవరి 2015

వరకు సా. 5.00 నుండి రాత్రి 9.00 గం॥ల

**వరకు ఇవ్వ బడును మరియు తిసుకోబడును.**

**దరఖాస్తు రుసుము. రూ॥ 500/- మాత్రమే.**

### : NOTE :

**Life / Partron Membership**
Application Form
will be issued and Received from
**1st to 28th February 2015**
Between 5pm to 9pm at
Mahasabha Administrative office
**Application Form Fees Rs. 500/-**

### ఒక మనవి

ఆంధ్రమహాసభ సభ్యులందరికీ సరికొత్తగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని సంకల్పించాం. కావున సభ్యులందరు ఈ క్రింద ఇచ్చిన కూపన్‌లో తమ వివరాలన్నీ స్పష్టంగా ఇంగ్లీష్ భాష లో పెద్ద అక్షరాల్లో పూర్తి చేసి పంపించాలనీ మనవి. వీలైతే ఇదే కూపన్‌ను కట్ చేసి, లేకుంటే ఈ వివరాలన్నీ తెల్లకాగితంపై వివ రంగా రాసి మహాసభ కార్యాలయానికి అందచేయాలనీ మనవి.

పేరు:--------------------------------

పుట్టిన తేది:--------రక్తపు గ్రూపు:-------------

చిరునామా:----------------------------

ఫోన్ / సెల్‌నం:-------------------------

మెయిల్:------------------------------

పీజీ/ ఎల్‌జీ/ ఎల్‌ఎల్ క్రమసంఖ్య-----

**తాజా ఫోటో ఒకటి జతచేయగలరు.**

**జరిగిన కార్యక్రమాలు** తేది: 20.12.2014



**నవగ్రహ పూజలు**

**ఆం**ధ్రమహాసభ ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వర పూజా మందిరం ట్రస్ట్, మహాసభ సంయుక్త అధ్వర్యంలో శనిత్రయోదశి సందర్భంగా మందిరంలో ఘనంగ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉదయం 7 గంటల నుండి పగలు 12.00 గంటల వరకు ఈ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ పూజాకార్యక్రమంలో భాగంగా నవగ్రహపూజ, హెూమం, శనితైలాభిషేకం లాంటి విధానాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముంబయి నలుమూలల నుండి భక్తజనులు భారీ సంఖ్యలో వచ్చి పూజాఫలాన్ని అందుకున్నారు. తర్వాత తీర్థప్రసాదాలు సేవించి భగవంతుని కృపకు పాత్రులయ్యారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రమహాసభ కార్యవర్గంతో పాటు పూజా మందిరం ట్రస్ట్‌కు చెందిన కార్యవర్గ సభ్యులెందరో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పూజా మందిరం కార్యదర్శి ఎస్వీ రామారావు, కోశాధికారి కె.రామారావు, ధర్మకర్తల మండలి సభ్యులు కెవిఎస్ఆర్ మూర్తి, డి.కమలాకర్‌రావు, మహాసభ ధర్మకర్తల మండలి కార్యదర్శి మంతెన రమేశ్, సభ్యులు కె. రమేశ్‌బాబు, పోతు రాజారాం, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, సంయుక్త కార్యదర్శులు యెలిగేటి రాజ్‌కుమార్, కోశాధికారి రాపెల్లి పరమేశ్వర్, సభ్యులు గుజ్జేటి గంగాధర్, బదుగు విశ్వనాథ్, రాంపెల్లి జ్ఞానేశ్వర్, మహిళాశాఖ కార్యదర్శి యత్తం లత, ఉపాధ్యక్షురాలు తురగా జయశ్యామల, సభ్యులు శ్యామల రాంమోహన్.

❀❀❀

# భూ'తాపం'

సాహితీ దర్పణం

**- గొండ్యాల రమేశ్**

**కో**ట్ల సంవత్సరాల చరిత్ర ఉన్న
భూతల్లీ..!
ఎన్ని ఒడుదుడుకులు ఎదుర్కొన్న ఓ అమ్మా..
నీ ఎదపై జీవజాలాన్ని రక్షించుకోవాలనీ
ఎన్నో పరిణామాలుగా పరీక్షించుకున్న ఓ తల్లీ..
తనువుని కండకండలుగా చీల్చుకొని
ప్రకృతి రూపంలో గాలీ నీరు నిప్పుతో సహా
సకల సౌకర్యాలు అందించావు.. అమ్మా..!
తపించావు నీ ఎదపై ప్రతి ప్రాణి
సుభిక్షంగా జీవించాలనీ
భరించావు ఎన్ని అవరోధాలైనా...
ఆధిపత్యం కోసం ప్రాణుల మధ్య
జరిగిన ప్రతి సందర్భానికి నువ్వే సాక్షి..
మనిషిలో స్వార్థం పెరిగి ప్రకృతితో
పరిహాసమాడుతూ..
కళ్ళ ముందున్న జీవరాశుల్ని ధ్వంసం చేస్తూ
ఖగోళమంతా కలియతిరుగుతున్నాడు
జీవం ఆనవాళ్ళ కోసం..
ఇది అజ్ఞానమా.. మూర్ఖత్వమా అమ్మా..!
ఎంతైనా కాలం గొప్పది
నీవే కలగజేసుకుంటావనీ
ఎదురుచూస్తున్నాం...!!

❀❀❀




# అశ్రు నివాళి

**మా** ప్రియ మిత్రులు, **తెలుగు యూత్ అసోషియేషన్** సంస్థాపక అధ్యక్షులు, ప్రముఖ సామాజిక కార్యకర్త

స్వర్గీయ **పసుపులేటి మల్లికార్జున్ నాగరాజులు** గారి

22వ వర్ధంతి సందర్భంగా హృదయపూర్వక స్మృత్యాంజలి అర్పిస్తున్నాం.



Late Shri . **Pasupuleti Mallikarjun Nagarajulu**

**TELUGU YOUTH ASSOCIATION**
**FOUNDER PRESIDENT**

**'మిత్రమా..!**

మమ్మల్ని విడిచి వెళ్ళి 22 సంవత్సరాలు పూర్తయినప్పటికీ మేమింకా నీ తీపి జ్ఞాపకాల తేనె సముద్రంలో తడిసిపోతూనే ఉన్నాం. భౌతికంగా నీవు దూరం అయినప్పటికీ, మా గుండె గదిలో నీవు చిరునవ్వుల మరుమల్లెలు పూయిస్తూనే ఉన్నావు.

నీవు మాకు అందనంత దూరంలో ఉన్నా నిన్ను మేం మాత్రం మరిచిపోలేం.

నీవెక్కడ ఉన్నా మన:శ్శాంతితో వర్ధిల్లాలనీ కోరుకుంటున్నాం.



**యాపురం వెంకటేశ్వర్,** ప్రధాన కార్యదర్శి - ది బొంబాయి ఆంధ్రమహాసభ అండ్ జింఖానా

## జరిగిన కార్యక్రమాలు

తేది : 27.12.2014 నుండి 30.12.2014




## వరకు. 4వ చైర్మెన్ ట్రాఫీ క్యారం జిల్లా స్థాయి టోర్నమెంట్

'దర్పణం'

క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఆంధ్రమహాసభ ప్రాంగణంలో తేది 27.12.2014 నుండి 30.12.2014 వరకు 4వ చైర్మెన్ క్యారం పోటీలు నిర్వహించారు.

పురుషుల, స్త్రీల మరియు అండర్ - 18 జూనియర్ బాలుర, బాలికల సింగిల్ కలిపి మొత్తం 375 ఎంట్రీలు వచ్చాయి. తేది: 27.12.2014 నాడు ఈ పోటీలు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి తెలంగాణకు చెందిన ప్రముఖ వాగ్గేయకారులు గోరటి వెంకన్న ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

వారితో పాటు ముంబయి జిల్లా క్యారం అసోషియేషన్‌కు చెందిన ప్రముఖులు శివ కుమార్ లాడ్, అరుణ్ కేదార్, ప్రదీప్ మైకర్, యతిన్ ఠాకూర్, ఆంధ్రమహాసభ ధర్మకర్తల మండలి సభ్యులు కె. రమేశ్‌బాబు, ప్రధాన కార్యదర్శి యాపురం వేంకటేశ్వర్, సాహిత్య విభాగ ఉపాధ్యక్షులు నడిమెట్ల యెల్లప్ప, సంయుక్త కార్యదర్శి వేముల మనోహర్, యెలిగేటి రాజ్‌కుమార్, సభ్యులు గుజ్జేటి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



ఈ పోటీలు నాలుగు రోజుల పాటు అంటే 30.12.2014 వరకు జరిగాయి.

ఈ పోటీలలో...

పురుషుల విభాగంలో ఫైనల్స్‌లో దిలేశ్ కేడేకర్ తన ప్రత్యర్థి సందీప్ దేవురుక్‌కర్‌ను 25- 11, 25-16 తేడాతో ఓడించి విజేతగా నిలిచారు.

మహిళా విభాగంలో ఫైనల్స్‌లో మైత్రేయి గోగాటే తన ప్రత్యర్థి అనుపమ కేదార్‌ను 25-11, 25-16 తేడాతో ఓడించి మొదటిస్థానం పొందారు.

అండర్ -18 విభాగంలో ఫైనల్ పోటీలో దీపక్ మారు తన ప్రత్యర్థి ఇర్ఫాన్ షేక్‌పై 25-3, 24-4 తేడాతో విజయం సాధించారు.

ఆంధ్రమహాసభలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విజేతలందరికీ అధ్యక్షులు సంకు సుధాకర్, ధర్మకర్తల మండలి చైర్మెన్ సంగం ఏక్‌నాథ్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు నడిమెట్ల యెల్లప్ప, ముంబయి జిల్లా క్యారం అసోషియేషన్ అధ్యక్షులు ప్రదీప్ మైకర్, ఉపాధ్యక్షులు దీపక్ పాటిల్, కార్యదర్శి యతిన్ ఠాకూర్ చేతుల మీదుగా బహుమతులు అందచేశారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గట్టు నర్సయ్య, సంయుక్త కార్యదర్శి యెలిగేటి రాజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు బడుగు విశ్వనాథ్, తాటికొండ మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

❊❊❊





# సైనికుడు

సాహితీ దర్పణం

**-నాగెళ్ళ దేవానంద్**

**ఓ**.. సైనిక సోదరా..
ఎవరి కోసం నీ తపన
ఎవరిని రక్షిస్తున్నావ్..
నీ బంధువుల కోసమా
నీ కులపోళ్ల కోసమా..
నీ మతపోళ్ళ కోసమా..
ఎవరి కోసం నీ త్యాగం..?

బార్డర్‌దాటి శత్రువులు రాకుండా
ప్రాణాలు అడ్డుపెడతావు..
దేశప్రజల కోసం
అవమానాలు భరిస్తావు...
సరిహద్దులో నీ ఆస్తులున్నాయా
లేకున్నా నీ అస్తిత్వాన్ని అడ్డం వేస్తావు..
ఎవరి కోసం సోదరా..?



నీకు ఏ కులం లేదు
నీకు ఏ మతం లేదు
నీకు ఏ భాషా లేదు
నీ అభిమతమే వేరు..
నీకు జోహార్లు..!!

దేశంలో ఉంటూ కుల, మతపరంగా
హక్కుల పోరాటం చేస్తున్నవారికి
నీ హక్కులు గుర్తుకు రావు...
ఏ హక్కులు లేని దేశభక్తుడివి నీవు..

శత్రువు దేశం బయటే ఉన్నాడా..
నిన్ను సరిహద్దులో రక్షణ కవచం చేసుకొని
పూటకో మాట మార్చుతూ
రోజుకో పార్టీ మార్చుతూ
కులమత ప్రాంత భాషా ద్వేషాలను పెంచుతూ
జనాల్ని చిందర వందర చేస్తున్న నాయకుల
సంగతేంది?

బార్డర్ దాటితే బయటి శత్రువు
నీవుండగా వాడు ఎలాగూ రాలేదు..
వీడు లోపలి శత్రువు
వీడే వాడికన్నా డేంజర్..!!

❊❊❊

## జరిగిన కార్యక్రమాలు తేది : 01.01.2015



**వైకుంఠ ఏకాదశి వేడుకలు**

శ్రీ వెంకటేశ్వర పూజా మందిరం ట్రస్ట్, ఆంధ్రమహాసభ సంయుక్త అధ్వర్యంలో తేది 01.01.2015 అనగా నూతన సంవత్సర తొలి రోజు మహాసభ ప్రాంగణంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం నాడు ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఉదయం 3.00 గంటల నుండి ప్రారంభమైన ఈ వేడుకల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పంచోపనిషత్ అభిషేకం ద్వారా పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి.

సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన తెలుగు వారు ఈ వేడుకల్లో భారీ సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ఉత్తరాముఖ దర్శనము చేసుకొని, తీర్థప్రసాదాలు సేవించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా గోవింద నామము, విష్ణు సహస్రనామాలతో భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రోతలు ఈ సంగీతమయ భజన కార్యక్రమాలను శ్రవణానందకరంగా విని తరించిపోయారు.

ఈ కార్యక్రమంలో పూజా మందిరం ట్రస్ట్ చైర్మెన్ ఎఎస్ఆర్ కృష్ణప్రసాద్, కార్యదర్శి ఎస్వీ రామారావు, కోశాధికారి కె. రామారావు, ధర్మకర్తల మండలి సభ్యులు కెఎస్ఆర్ మూర్తి, డి.కమలాకర్‌రావు, మహాసభ అధ్యక్షులు సంకు సుధాకర్, మహిళాశాఖ అధ్యక్షురాలు తురగా జయశ్యామల, కార్యదర్శి యత్తం లత, సభ్యులు కె.రత్నకుమారి, బెహరా లలిత గార్లతో పాటు భారీ సంఖ్యలో మహిళలు, పిల్లలు భక్తులెందరో పాల్గొన్నారు.

❋❋❋

# ఓ కవితా !

**ఆనంద భారతి**

అడుగు అడుగులో
ఓ కొత్త అంశాన్ని స్వాగతిస్తాం
దిన దినము కొంత
బూజు దులిపేస్తాం
ప్రతి కొత్త నేస్తంతో
వంశ వృక్షాన్ని పెంచుదాం
అక్షాక్షిరానితో
లక్ష్మి సాధనను జయిస్తాం
గడచిన నిన్నను మరచి
పున్నమి వెన్నెల నింపేస్తాం
అంధకారాన్ని చీల్చి
అగ్నిజ్వాలలు కురిపిస్తాం
సభ్యతను ఆచరిస్తూ
అభ్యుదయాన్ని బోధస్తాం
కవితాలోకంలో
నవచరితను రాసేస్తాం
సాహితీ వనంలో
మన సత్తా చాటిద్దాం
చరిత్ర పుటల్లో మన
భండారాల్ని నిండుగా నింపుదాం
సమ సమాజ నిర్మాణానికై
కొత్త సాహసాలు చేసేద్దాం
నీవు నాతో నడుం కట్టి నడిస్తే
నా సర్వాన్ని అర్పిస్తా
కవితా ! ఓ కవితా !!
నేటి యువతకు భవిత
రేపటి ఉశోదయానికి
ఉధ్యమ ఊపిరివి
ఇప్పుడు నా ఆశయాల కవిచాని వి
కడపరకు నా అక్షర యాజ్ఞానిని.

❋❋❋

## జరిగిన కార్యక్రమాల 'దర్పణం'




ప్రతి పౌర్ణమికి నిర్వహిస్తున్నట్లుగానే ఈ నెల కూడా 4 జనవరి నాడు ఆంధ్రమహాసభలో ఎన్నీల ముచ్చట్ల కార్యక్రమం జరిగింది.


ఈ కార్యక్రమానికి తొలుత ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ స్వాగతం పలికారు. తర్వాత సాహిత్య విభాగ ఉపాధ్యక్షులు నడిమెట్ల యెల్లప్ప సమావేశాన్ని ఉద్దేశించి రెండు మాటలు మాట్లాడారు. ఆ తర్వాత యెల్లప్ప గాలి మురళీధర్‌ను సభాధ్యక్షత వహించాల్సిందిగా కోరారు.

సభాధ్యక్షులు సభను ప్రారంభిస్తూ తొలుత సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షులు గట్టు నర్సయ్యను ప్రారంభించాల్సిందిగా కోరారు. దాంతో గట్టు నర్సయ్య తెలంగాణకు చెందిన మరోకవి బైరి నర్సయ్య రాసిన సంక్రాంతి పాటను పాడి వినిపించారు. తర్వాత అంబల్ల జనార్ధన్ మానవత్వం ఫలించింది అనే తన కథను చదివి వినిపించారు.

ఏవీ అనంతరాం చదివిన 'సరదార్'ని అనే కవిత శ్రోతల్ని అలరించింది. ఆలోచింప చేసింది. సర్దారీల త్యాగనిరతిని, ధైర్యసాహసాల్ని పరిగణలోకి తీసుకోకుండా సర్దార్‌జీ జోకుల పేరుతో వారిని అవమానించే వారికి చెంపదెబ్బలాంటి కవిత్వాన్ని అనంతరాం వినిపించి అందరిలో ఆలోచన రేకెత్తించారు.

ఆ తర్వాత ఇప్పుడిప్పుడే సాహితీ ప్రపంచంలోకి ప్రవేశించిని నాగెళ్ళ దేవానంద్ చదివిన రెండు కవితల శ్రోతల మన్ననలు పొందాయి. అవ్వ మీద ఆయన చదివిన కవిత అక్కడున్న వారందరినీ పాత జ్ఞాపకా ల్లోకి తీసుకెళ్లింది. కన్యాశుల్కం అనే కవితలో తరిగిపోతున్న ఆడపిల్లల సంఖ్య





గురించి, భ్రూణ హత్యల గురించి ఆందోళన వ్యక్తపరిచారు. కట్టరాజు ఉషారాజు తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు అనే అంశంపై చక్కటి కవితను వినిపించారు. అక్కినపల్లి దుర్గేశ్ పోలవరం పై చైతన్యపూరితమైన కవితను వినిపించి సమకాలీన సమస్యలపై ముంబయి తెలుగు కవులు ఎవరికీ తీసిపోరు అని నిరూపించారు.

తెలంగాణ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, ముంబయిలో తెలంగాణ జెండాను తొలి నుండి

సగర్వంగా ఎగరేస్తున్న ఉద్యమకారుడు గొంద్యాల రమేశ్ 'ఒరేయ్.. సర్కారోడా..' అనే కవిత అక్కడున్న వారందరిలో ఉత్తేజాన్ని నింపింది. రమేశ్ తన వ్యక్తిత్వానికి తగిన కవిత చదివి తన సత్తా ఏంటో చాటాడు.

మచ్చ ప్రభాకర్ 'చావు పుట్టిన రోజు..' అనే కవిత ఆవేశంగా చదివి వినిపించారు. ఏకలవ్యుడు, శంభూకుడు తదితరుల త్యాగాన్ని తన కవితలో పొందుపరిచాడు. ఆ తర్వాత ఏదో పని ఉందని చెప్పి సమ్మేళనం నుండి వెళ్ళిపోయారు. పొన్నూరి భారతలక్ష్మి సంక్రాంతి పర్వదినం గురించి చక్కటి కవితను వినిపించారు. గుర్రం బాలరాజు, తదిదరులు కూడా తమ కవితల్ని వినిపించారు.

సంగెవేని రవీంద్ర రెండు కవితలను చదివి వినిపించారు. ఒకటి ఆకలి అనే అంశంపై, రెండోది ప్రతి విషయానికి మౌనం పాటించే సాంప్రదాయం వ్యంగ్యోక్తిగా మౌనం పాటిద్దాం రండి అనే కవితల్ని వినిపించిన నడిమెట్ల యెల్లప్ప కవిత్వం పై కవిత్వం వినిపింసిచ కవిత్వంలో ఐకమత్యం పాటిద్దాం అన్నారు.

అధ్యక్షత వహించిన గాలి మురళీధర్ కరువొస్తుంది తన కవితను వినిపించి, కవుల కవిత్వం పై క్లుప్తంగా విశ్లేషించారు. గట్టు నర్సయ్య వందన సమర్పణతో ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమం ముగిసింది.

❁❁❁




# మోత

- గాలి మురళీధర్

సాహితీ దర్పణం

**నే**తల హామీల మోత సునామీలో
వానతల్లి జడుసుకొని పారిపోతుంది..
నేలతల్లి గుండె ఎండిపోతోంది
జనాల ఆశల చిగురులు వాడిపోతున్నై
చేతలు ఎడారి దారిన
ఎండమావులవుతున్నై
అవిరౌతున్న రైతు ఆశలు
రెక్కలు తెగి ఎగిరిపోతున్నై
నీటి కటకటలలో పొలాలే కాదు
జనాల చూపులు కూడా ఎడారవుతున్నై
మంత్రాలతో చింతకాయలు
రాల్చే నాయకులు
'పంట'లేని 'కోతలు' కోస్తున్నారు
మంట లేకుండానే పొయ్యిలో
పిల్లిని లేపుతున్నారు
గాలి మేడలకు హద్దేలేదు
వింత చేష్టలకు చింతే లేదు
భూమి అంటే మట్టి
సమూహం కాదు
బడబాగ్నులు దాచుకున్న
నిప్పురవ్వల మూట
రైతంటే ఎముకలు తేలిన
కంకాళం కాదు..
సకల జనావళి ఆకలి తీర్చే గుట్ట
భూతల్లి గుండెలు పేలకముందే
ఆక్రోశాల లావా చిమ్మకముందే
రైతన్న రోదన విస్ఫోటించక ముందే
నీ మోతలకు ముగింపు పలకకపోతే
ఎక్కడో ఏదో అలజడి....
పక్కటెముకలే ఆయుధాలైన కదలిక
వానతల్లీ.. నీకో దండం..
కానీ,
బతుకు పొలాల్లో చితులు పేర్చే పాలకులారా...
బహు పరాక్...
కనిపిస్తున్న ఆ దండు జనం కాదు..
మండేందుకు సిద్ధమైన చెకుముకి రవ్వలు..!!!



❁❁❁

## జరిగిన కార్యక్రమాలు

తేది: 06.01.2015



**మహిళాశాఖ అధ్వర్యంలో**
**నూతనసంవత్సర స్వాగత కార్యక్రమం**

**ఆం**ధ్రమహాసభ మహిళాశాఖ అధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనవరి 6 నాడు నిర్వహించిన ఈ వేడుకల్లో ముందుగా ఇటీవలే పాకిస్థాన్‌లోని పెషావర్‌లోని సైనిక పాఠశాల విద్యార్థులపై ఉగ్రవాదులు జరిపిన దాడులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఆ తర్వాత దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన చిన్నారుల సంతాప సూచకంగా ఒక నిమిషం పాటు మౌనం వహించి నివాళులర్పించారు.

తర్వాత మహిళలందరూ రకరకాల ఆటలతో పాటలతో సంబరాలు చేసుకున్నారు. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఆటపాటల తర్వాత వచ్చిన అతిథులందరికీ ఆత్మీయ భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హాజరైన ప్రతిఒక్కరికి మహిళాశాఖ అధ్యక్షురాలు తురగా జయశ్యామల, కార్యదర్శి యత్తం లత శుభాకాంక్షలందించారు.

ఈ కార్యక్రమంలో మహిళాశాఖకు చెందిన బెహరా లలిత, పిల్లమారపు పద్మ, కె.సుజాతామూర్తి, రత్నకుమారి, శ్యామల రాంమోహన్, దమయంతి దేవి, మచ్చ సుజాత తదితరులు పాల్గొన్నారు.

❀❀❀



# ఏమో..!

- ఏవీ అనంతరామ్

**బూ**డిద మిగలని కర్పూరాన్ని నేను
నా శ్రీహరి కోటలో
మామ్ రాకెట్టు కింద మసలి
రగులుకున్న మంటల్లో మౌనంగా
హారతినైన చిరు చీమను నేను...
బూడిద మిగలని కర్పూరాన్ని నేను...
ఉద్యమాల ఉద్రేకంలో ముసలి అవ్వను మరిచి
నా తెలంగాణ జ్యోతికి తోడుగా
దూదొత్తినై ఆరి ఆరి తెలంగాణకు
ఆరని కాంతినిచ్చిన ఓ కాంతాచారిని నేను ...
బూడిద మిగలని కర్పూరాన్ని నేను...
తొలి రాతిరి ఆత్రపు గాత్రంలో మెత్తపక్కన
మెత్తమెత్తగా జారిన పోచంపల్లి చీరంచును
అమాంతం కావలించుకున్న
అగరొత్తుల మనిషిని నేను...
శివరాతిరికి కీసర గుట్టపైన
పాతపాపాలను కడిగేసుకుంటూ
గుట్ట దిగినాకా పాపాల పుట్టను...
తెలుగమ్మను సన్యసించి
తెగులమ్మను వరించి ఒకే ఒక్క తెలుగు సంఘంలో
వేవేల తెలుగు జంగాలతో
మితిమీరి సంగమించి ఆ రాపిడిలో రాలి రాలి
నిన్ను తలకిందులుగా ముంచేసిన గుట్టను నేను...
నీ నోరు నొక్కేసిన బూడిద గుట్టను నేను..
అరెరెరెరెరెరెరెరెరెరెరెరె...
తెలుగుజాతి రేవీ.. తెలంగాణ పీవీ
అర్థికసంస్కరణల రేడువీ
దేశచరితను మార్చిన యశస్వివి
అయ్యో... సగం బూడిదైన కాయానివి..
ఎందుకు... ఎందుకు పీవీ..? తెగులు సంఘాలకు
లేని సిగ్గు తెద్దామా... కుటిల రాజకీయాలను
రూపుమాపుదమా.. ఎందుకు పీవీ..? ఎందుకు..?
ప్చ్.. నీ చేతకాదు కానీ
నన్ను కాటి కాపరిని కానీయ్
నీ సగం కాయాన్ని బూడిద చెయ్యనియ్..!! ❀❀❀

## జరిగిన కార్యక్రమాలు

తేది : 10.01.2015



### కాళోజీ శతజయంతి ఉత్సవాలు



అక్షరయోధుడు, పద్మవిభూషణుడు, అమర కవి కాళోజీ నారాయణరావు శతజయంతి ముగింపు సందర్భంగా ఆంధ్రమహాసభలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాళోజీ శత జయంతి ఉత్సవాలు 2014 లోనే ముగిసినప్పటికీ వాటికి కొనసాగింపుగా ముంబయిలో చివరి సమావేశం నిర్వహించారు. ఈ శతజయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా కాళోజీ శత జయంతోత్సవ సమితి సంస్థాపక అధ్యక్షులు ఎన్.రామశాస్త్రి, సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాసరావు గార్లు విచ్చేశారు.

తొలుత అతిథులతో పాటు మహాసభ అధ్యక్షులు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు నడిమెట్ల యెల్లప్ప సమక్షంలో జ్యోతి ప్రజ్వలన గావించారు. ఆ తర్వాత ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ సభకు స్వాగతం పలికి సభా నిర్వహణ బాధ్యత ఉపాధ్యక్షులు నడిమెట్ల యెల్లప్పకు అప్పగించారు.

సభా కార్యక్రమంలో ముందుగా పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కాళోజీ జీవితంలోని పలు ఘట్టాలను తెలియచేశారు. కాళోజీలోని పోరాట పటిమ, ముక్కుసూటితనం, నిర్భయత్వం లాంటి ఎన్నో విశేషాలతో కూడిన పలు సంఘటనలు వివరించారు.











తర్వాత ఎన్.రామశాస్త్రి మాట్లాడుతూ, కాళోజీ తనకున్న అయిదు దశాబ్దాల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కాళోజీతో గడిపిన మధుర క్షణాలు, ఆంతరంగిక విషయాలు, నేటి తరానికి ప్రేరణ కలిగించే కాళోజీ పోరాట పటిమ లాంటి పలు అంశాలను తెలిపి ఆహుతులకు కాళీజీ పట్ల అవగాహనను పెంచారు.

తర్వాత సినీగేయ రచయిత రాదండి సాదయ్య బృందంవారి జానపద సంగీత సంబరాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. పలువురు గాయకులు ఎంతో మధురమైన పాటలు పాడి సభికుల్ని రంజింప చేశారు.

ముఖ్యఅతిథి ఎన్.రామశాస్త్రి వారిచే మహాసభ నూతన వేబ్‌సాయిట్ www.bamsg.org ప్రారంభించబడినది. చివరగా ఆంధ్రమహాసభ తరఫున అతిథుల్ని ఘనంగా సన్మానించారు.

మహాసభ కార్యవర్గ సభ్యులతో పాటు, ఈ కార్యక్రమానికి తెలుగు ప్రజలు భారీసంఖ్యలో హాజరయ్యారు.

## జరిగిన కార్యక్రమాలు

తేది: 17.01.2015





**మహిళాశాఖ వారి సంక్రాంతి సంబరాలు**

**ఆం**ధ్రమహాసభకు చెందిన మహిళాశాఖ అధ్వర్యంలో తేది:17.01.2015 నాడు మహాసభ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.

ఈ సంక్రాంతి వేడుకలకు మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

తొలుత మహిళాశాఖ కార్యదర్శి యత్తం లత సభకు స్వాగతం పలికారు. తర్వాత సంక్రాంతి వేడుకల్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా గొబ్బెమ్మ పాటు పాడారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. విభిన్నమైన ముగ్గులతో సభాప్రాంగణం నిండిపోయింది. ఈ పోటీల్లో ఎందరో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మహిళలంతా సామూహికంగా నృత్యాలు చేసి పండగను జరుపుకున్నారు. హాజరైన మహిళలందరికీ మహిళాశాఖ వారు పసుపు కుంకుమలతో పాటు కానుకలు బహుకరించారు. చిన్న పిల్లలకు సంక్రాంతి సందర్భంగా ఆశీస్సులు తెలిపి కానుకలు ఇచ్చారు. కోలాటంతో మహిళలు ఉల్లాసంగా గడిపారు.

ఈ కార్యక్రమంలో మహిళాశాఖ అధ్యక్షురాలు తురగా జయశ్యామల, కార్యదర్శి యత్తం లత, సభ్యులు సంగెవేని విజయ, పిల్లమారపు పద్మ, దేవీరావు, మచ్చ సుజాత, శ్యామల రాంమోహన్, సుజాతా మూర్తి, రత్నకుమారి, పొన్నూరి భారతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

❀❀❀





# లక్ష్మి జ్యేలర్స్



# LAXMI JEWELLERS

Advt.




మా వద్ద తెలుగు వారి అన్ని రకముల
వెండి, బంగారు నగలు విశ్వాస పూర్వకముగా
916 హాల్ మార్క్ తయారు చేసి ఇవ్వబడును,
తయారు నగలు దొరుకును. 90 సంవత్సరాల
నుండి ప్రసిద్ధి పొందిన నమ్మకమైన
ఇల్లందుల వారి దుకాణం



**Dealers in : 916 Hall Mark Gold, Silver & Fancy Ornaments**

షాప్ నం. 4, పటేల్ మెన్షన్, ఖేడ్‌గల్లి, సయాని రోడ్, ముంబయి- 400 025

**Shop No. 4, Patel Mansion, Khedgally, Sayani Road, Mumbai - 400 025**

**Tel.: 2430 1744 / 9870377535**




**Dasharath B. Jindam**
**98330 30334**

# ARCHANA
## G A R M E N T S

Specialist in 100% Pure Linen

**తెలుగు భాందవ్పులందరికి**

# మహాశివరాత్రి శుభాకాంక్షలు

Opp. Worli, B.D.D. Chawl No. 105 S.S. Amrutwar Marg, Mumbai - 400 013

# జరిగిన కార్యక్రమాలు

తేది : 26.01.2015




ఆంధ్రమహాసభలో గణతంత్రదినోత్సవ వేడుకలు ఆంధ్రమహాసభ అనవరణలో జనవరి 26 న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గం॥లకు శ్రీ శ్రీ శ్రీ సంపూర్ణ నందగిరి స్వామి శ్రీ సుఖ బ్రహ్మాశ్రమము ఉత్తరాధికారి గారి చేతుల మీదుగా పతాక ఆవిశ్కరణ జరుపబడినది ఇట్టి అవారు మాట్లాడుతూ మహాత్మ గాంది గారి గురించి, ఆయన చేసిన సేవలు కోనిచూడారు.

అధ్యక్షులు శ్రీ సంకు సుధాకర్ గారు మాట్లాడుతు, భారతదేశ పౌరునిగా, మన స్వాతంత్యనికై పోరాడిన అమరవీరులను జ్ఞాపకం చేసుకుంటూ సమాజ సేవ చెయ్యా లని తెలిపారు, ప్రదాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్ గారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం మహాసభ భవనంలో నూతనంగా అమర్చిన CCTV Camera ప్రారంభోత్సము జరుపబడినది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సంకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి యాపురం వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు అనుమల్ల రమేశ్, గట్టు నర్సయ్య, నడిమెట్ల యెల్లప్ప, సంయుక్త కార్యదర్శులు యెలిగేటి రాజ్‌కుమార్, కోశాధికారి రాపెల్లి పరమేశ్వర్, పిఆర్ఓ ఎ.వి. నాగేశ్వర్‌రావు, సభ్యులు బదుగు విశ్వనాథ్, కటుకం గణేశ్, యస్. కసిరెడ్డి పూజా మందిర్ చైర్‌మెన్ ఎయస్ఆర్ కృష్ణప్రసాద్, మహిళాశాఖ అధ్యక్షురాలు తురగా జయశ్యామల, కార్యదర్శి యత్తం లత, సభ్యులు శ్యామల రాంమోహన్ తదదితరులు పాల్గొన్నారు.

❀❀❀




A.V. NAGESWARA RAO
PRO - Shriram Chits (M) Ltd.
anr28@rediffmail.com
Mob.: 9029434560 / 9833434572
మీ విశ్వసనీయమైన ఆర్థిక
నేస్తం-నేటికీ, ఏనాటికీ!
శ్రీరామ్ చిట్స్
శ్రీరామ్ చిట్స్ (మహారాష్ట్ర) లిమిటెడ్,
418-419,బెజోలా కాంప్లెక్స్ సుమన్ నగర్ ఎదురుగా,
సియోన్-ట్రాంబే రోడ్, చెంబూర్ ఈస్ట్, ముంబయి-71.
ఫోన్ : +91 22 42680800-99
Shriram Chits
Empowering People Through Prosperity
• Chit Funds
• Deposits
• Life Insurance
• General Insurance
• Personal Loans
• S.M.E. Loans
• Loans Against property
• Gold Loan
• Loan For Gold Purchase
Shriram Chits (Maharashtra) Ltd.,
418-419, Bezzola Complex,Opp. Suman Nagar,
Sion-Trombay Road,Chembur (E), Mumbai - 400 071
Tel.: 42680800 - 99 Fax: 42680822
Advt.

ది బొంబాయి ఆంధ్ర మహాసభ & జింఖానా

# The Bombay Andhra Mahasabha & Gymkhana

**10-C, Lakhamsi Napoo Road, Dadar (E), Mumbai - 400014. Tel. 24144377 / 24144388, Fax: 24119832.**

## BAMS
## Darpanam Advertisement

## ORDER FORM

Name : ____________________________________________

Address:____________________________________________

____________________________________________________

Contact No:______________________ Life Membership No. __________

Advertisement in : Colour ☐ B/W ☐ Front / back inside ☐ Back ☐

Advertisement size : ________________________________

Advertisement Matter supplying in format : ______________________

Date : ____________

Place : ____________

______________________
Signature of Member

### Advertisement Size & Rate

| | | | |
|---|---|---|---|
| 1. | Back Colour Page | - size 220 mm x 165 mm | - Rs. 5,000/- |
| 2. | Front & Back inside page | - size 220mm x 165 mm | - Rs. 4,000/- |
| 4. | Middle colour full page (Subject to availability) | - size 220mm x 165 mm | - Rs. 3,000/- |
| 3. | Middle colour ½ page (Subject to availability) | - size 105mm x 165 mm | - Rs. 2,000/- |
| 5. | Black & White full page | - size 220 mm x 165 mm | - Rs. 2,000/- |
| 6. | Black & White ½ page | - size 105 mm x 165 mm | - Rs. 1,000/- |

NOTE : Please send the advertisement content in JPEG format in a CD along with this Form and/or you can e-mail the same at mahasabha@gmail.com

## మీకు తెలుసు కదా..!

**మ**హాసభ అంటే కేవలం మనోరంజక కార్యక్రమాలు, కాలక్షేపాలే కావనీ, **తెలుగు సాహితీ సంస్కృతులు** పరిరక్షణ కేంద్రమనీ, తెలుగు ఐక్యతకు ప్రతీక అని మీకు తెలుసు కదా..! అంతేకాదండీ..! ఇంకా ఉన్నాయి..

### మీ భక్తి ప్రవృత్తుల కోసం..



**మ**హాసభ ప్రాంగణంలోనే శ్రీ వెంకటేశ్వర దేవాలయం ఉంది. నిత్యపూజలతో కళకళలాడే ఆ స్వామివారిని దర్శించుకుంటే ఏ ఆపదలు రావనీ, ఆపదమొక్కుల వాడి ఆశీస్సులు అందరికీ అందుతాయనీ మీకు తెలుసు కదా..! అయితే ఇంకేం..? రండి..! సకుటుంబ సపరివారంగా మహాసభలో కొలువై ఉన్న ఏడుకొండలవాడిని దర్శించుకుని పాపపరిహారం పొందడమే కాకుండా మోక్షమార్గాన్ని సులభతరం చేసుకొండి..!

### మీ ఆరోగ్యం కోసం..

‘**ఆ**రోగ్యమే మహాభాగ్యం’ అన్నారు పెద్దలు..మరి ఆరోగ్యం బాగుండాలంటే దేహం చురుకుగా ఉండాలి. దేహం చురుకుగా ఉంగాలంటే ప్రతి అవయవం వేగంగా కదలాలి. అందుకే ఆంధ్రమహాసభలో స్కేటింగ్‌ను ప్రవేశపెడుతున్నాం. అయితే ఇందుకోసం కొంత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మహాసభ జీవిత సభ్యులకు ఈ ఫీజు ప్రతి వ్యక్తి రూ॥లు 350/–, జీవిత సభ్యులు కాని వారికి రూ॥ 850/– ప్రతి నెల చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి బుధ, శుక్రవారం నాడు సాయంత్రం 5 గం॥ నుండి 8 గం॥ వరకు స్కేటింగ్‌లో శిక్షణ ఇవ్వబడుతుంది. ఇవన్నీ మీకు తెలుసు కదా..!



### మీ విజ్ఞానం కోసం..



**పు**స్తకం హస్త భూషణం అన్నారు కదండీ..! అంతేకాదు.. పుస్తకాలు లేని ఇల్లు స్మశానంతో సమానమని కూడా అన్నారు. పుస్తకం మనిషి మస్తిష్కానికి ఎరువులాంటిది. అలాంటి విజ్ఞానజ్యోతుల్ని వెలిగించి పెంచే దాదాపు 8 వేల అమూల్యమైన గ్రంథాలెన్నో ఆంధ్రమహాసభలోని శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గ్రంథాలయంలో మీ కోసం ఎదురుచూస్తున్నాయనీ మీకు తెలుసు కదా..!


### మీ సంస్కృతి కోసం..

**క**ళలు మన సంస్కృతికి తాళపు చెవులు. కళలు ఒక జాతికి ధృవీకరణ పత్రాలు. నాట్యం, గానం, సంగీతం, సాహిత్యం అన్నీ కూడా మనిషిలోని చీకటి తెరల్ని తొలగించి, వెలుగు కిరణాలకు స్వాగతం పలికే దీపదారులు. మహాసభలో వివిధ నాట్య రీతుల్ని నేర్పించే తరగతులు నిర్వహిస్తున్న విషయం మీకు తెలుసు కదా..!



**వీటితోపాటు ప్రతి నెలా విజ్ఞానపీఠం, వినోద, ధార్మిక కార్యక్రమాలు, ఆరోగ్యశిబిరాలు, కౌన్సిలింగ్ ప్రోగ్రాములు రెగ్యులర్‌గా జరుగుతాయి. దర్పణంలో కార్యక్రమాల వివరాలు తెలుసుకొండి.. రండి..! ఆంధ్రమహాసభ మనది.. మనందరిది..! కార్యక్రమాల్ని విజయవంతం చేద్దాం..! మన స్వాభిమానాన్ని పెంచుకొందాం..!!**

## ఇది మీకు తెలుసు కదా...!!



## తెలుగు క్రికెట్ క్రీడాకారులకు శుభవార్త

**నే**డు ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తున్న ఆట క్రికెట్. మన దేశంలో క్రికెట్ అంటే ఒక మతంగా, క్రికెట్ క్రీడాకారులంటే దేవుళ్ళుగా భావిస్తున్నారు. గల్లీ నుండి ఢిల్లీ దాకా, పొలాల నుండి సందు గొందులు వరకు ఎక్కడ చూసినా అన్ని తరగతుల, అన్ని వర్గాల వారు క్రికెట్ ఆడుతున్నారు.

క్రికెట్ మేనియా తలకెక్కి పాడుతున్న తరుణంలో మనం ఉన్నాం.

ముంబయిలో తెలుగువారు అన్ని రంగాల్లో అగ్రగామిగా కొనసాగుతున్నారు. కానీ ఇంత వరకు తెలుగువారికి ఒక క్రికెట్ టీం అంటూ లేదు. అందుకే ఆంధ్రమహాసభలో ఒక క్రికెట్ టీంను తయారు చేయాలనుకొని..

### క్రికెట్ (సీజన్) టీం

ను ఏర్పాటు చేస్తున్నాం. ఇది తెలుగు క్రికెట్ క్రీడాకారులకు ఎంతో చక్కని సువర్ణావకాశం. క్రికెట్‌లో ఆసక్తిలో ఉండి సరైన వేదిక లభించని క్రీడాకారులు వెంటనే ఆంధ్రమహాసభ ఇస్తున్న ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరుతున్నాం.

మిగతా వివరాలకై వెంటనే ఆంధ్రమహాసభ కార్యాలయాన్ని సంప్రదించండి. ఆంధ్రమహాసభలో ఉన్న ఒక ఫారం ను నింపి కార్యాలయంలో మీ పేరు నమోదు చేసుకోవాలని మనవి.

చివరి తేది: 7 ఫిబ్రవరి, 2015.

త్వరపడండి...! మీ కోసం ఒక బంగారు అవకాశం ఎదిరిచూస్తోంది..! ఏమో రేపటి తెండూల్కర్ మీరే కావొచ్చు..!!

## జరగబోయే కార్యక్రమాలు

### తేది: 07.02.2015, సాయంత్రం 7.00 గంటల, బుర్ర కథ మరియు స్థానిక కళాకారుల నృత్యప్రదర్శన

తెలుగు వారి జానపద వారసత్వమైన బుర్రకథ కార్యక్రమాన్ని ఆంధ్రమహాసభలో నిర్వహించనున్నాం. కనుమరుగవుతున్న ఇలాంటి జానపద కళలకు జవసత్వాలు ఇవ్వాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాం.



బుర్రకథ సామ్రాట్, ఎలక్రిక్ బ్రహ్మ బిరుదాంకితులైన ఆర్మూర్, మగ్గడి వాస్తవ్యులు చౌకె లింగం బృందం ఈ బుర్రకథను వినిపిస్తారు.

మీరంతా ఇంటిల్లిపాది విచ్చేసి మన గ్రామీణ జ్ఞాపకాలను మరొక్కసారి నెమరువేసుకొని ఈ కళకు చేయూత నివ్వాలనీ కోరుకుంటున్నాం. దినితో పాటు సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శిని శ్రీమతి రాధామోహన్ గారి శిష్యబృందం (ఆంధ్ర మహాసభ లో నృత్య శిక్షణ పోందుతుంన చిన్నారులచే Images of India నృత్య రుపకం ప్రదర్శింపబడును.





**ప్రతినెల పౌర్ణిమనాడు ఎన్నీల ముచ్చట్లు సాహితీ గోష్టి**
**సాహిత్యాబిమానులు, కవులు, రచయితలు, రచయిత్రులు**
**తెలుగుబాష అబిమానులు పాల్గోనేందుకు**
**అరుదైన అవకాశం అంధ్ర మహాసభలో.....**

# జరగబోయే కార్యక్రమాలు




తేది: 1 మార్చి, 2015 రోజున ఆంధ్రమహాసభ ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వర పూజా మందిరం ట్రస్ట్ మరియు ఆంధ్రమహాసభ కార్యవర్గం సంయుక్త అధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. భక్తులందరు ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడు కూడా కన్నుల పండుగగా జరిగే ఈ కళ్యాణమహోత్సవంలో పాల్గొని స్వామివారి కృపాపాత్రులు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

## : మహిళాశాఖ అధ్వర్యంలో జరగబోయే కార్యక్రమాలు :



**తే**ది: 10 ఫిబ్రవరి నుండి 12 ఫిబ్రవరి వరకు మూడు రోజుల పాటు మహిళాశాఖ అధ్వర్యంలో మహిళల కోసం ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12.00 గంటల నుండి 5.00 వరకు ఈ ఆటల పోటీలు జరుగుతాయి. ఇందులో రమ్మీ, అడ్డాట, క్యారం తదితర ఆటలు ఉంటాయనీ మహిళాశాఖ అధ్యక్షురాలు తురగా జయశ్యామల, కార్యదర్శి యత్తం లత పేర్కొన్నారు. ఆసక్తి గలవారంతా పాల్గొనాలనీ వారు మనవి చేశారు.



**తే**ది: 27.02.2015 నాడు త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలు మధ్యాహ్నం 3.00 గంటలకు ప్రారంభమవుతాయని మహిళాశాఖ అధ్యక్షురాలు తురగా జయశ్యామల తెలిపారు.

**తే**ది: 10.03.2015 నాడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళాశాఖ అధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలు ఉదయం 11 గంటల నుండి మధ్యానం 4.00 గంటల వరకు కొనసాగుతాయనీ, మహిళలంతా భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలనీ మహిళాశాఖ అధ్యక్షురాలు తురగా జయశ్యామల, కార్యదర్శి యత్తం లత విజ్ఞప్తి చేశారు.




పైన ఉదహరించిన కార్యక్రమాల గురించి మిగతా వివరాల కోసం మహిళాశాఖ అధ్యక్షురాలు **తురగా జయశ్యామల** (098200 03133), కార్యదర్శి **యత్తం లత** (093226 42347), గారిని సంప్రదించగలరు.

## పొద్దు పూసింది

**- అశోక్ కుమార్.**

పొద్దు పూసింది
కిరణాయుధుడొచ్చాడు
ధాత్రి వెనుక రాత్రి దాక్కుంది...

సగటు జీవితం
బతుకంతా గాడిద
చచ్చాక బూడిద

ఒంటి చీర బతుకులు కొన్ని
ఒంటి మీద చీరేలేని బతుకులు కొన్ని
భిన్న సంస్కృతి..

మేడల పునాదులన్నీ
కష్టజీవుల సమాధులే
దాచేస్తే దాగని సత్యం..



Advt.



Dyavarishetty Gangadhar
President

## తెలుగు భాంధవులందరికీ

# మహాశివరాత్రి

## శుభాకాంక్షలు



Talla Tirupati
General Secretary

**Vivek Granthalaya, Mumbai**

"Darpanam" The official inhouse monthly news letter of "The Bombay Andhra Mahasabha & Gymkhana"
(For Members Only) Nov. 2014 - Jan.2015


# HORIZON GROUP

Builders & Developers





A-245, Balaji Bhavan,
Plot No. 42A, Sector-11,
CBD Belapur,
Navi Mumbai - 400 614.

Tel.: 022-27560442
Email : reddymk@gmail.com
www.horizonlivingspaces.com

Advt.